హైదరాబాద్ వార్త

వైభవంగా లష్కర్ బోనాలు

దారులన్నీ అమ్మ వారి ఆలయానికే

తొలిబోనం సమర్పించిన మంత్రి తలసాని కుటుంబసభ్యులు

అమ్మ వారిని దర్శించుకున్న ముఖ్యమంత్రి దంపతులు

హర్యానా గవర్నర్,కేంద్రమంత్రి, ప్రభుత్వ ప్రిన్సిపాల్ సెక్రటరీ శాంతి కుమారి. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల చైర్మన్లు, ఇతర పార్టీల నేతలు

హైదరాబాద్, జూలై 9 ప్రభాతవార్త: ఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి ఆషాడ బోనాల జాతర అంగరంగ వైభవంగా ప్రారంభ మైంది.డప్పుల చప్పుళ్లు,పోతరాజుల కోలాహలం,జోగినుల నృత్యాలు,ఫలాహార బండ్ల కోలాహలం తో జాతర ఎంతో వైభవంగా ప్రారంభమైంది.ఆదివారం తెల్లవారు ఝామున మంత్రి తలసాని కుటుంబంతో కలిసి వెళ్లి అమ్మ వారికి తొలిబోనం సమర్పించారు. అనంతరం గం 4.15నిలకు అమ్మవారి దర్శనానికి సాధారణ భక్తుల దర్శనానికి అనుమతించారు.వేకువ ఝామునుంచే అమ్మ వారి ఆలయానికి మహిళలు నెత్తిన బోనంతో తరలి వచ్చి అమ్మ వారికి బోనాలు సమర్పించారు.ఈ సందర్భంగా జంట నగరాలతో పాటు రెండు తెలుగు రాష్ట్రాలు,దేశ,విదేశాల నుంచి లక్షలాదిగా భక్తులు అమ్మ వారి దర్శనానికి పోటెత్తడంతో సికింద్రాబాద్ లోని రోడ్లన్నీ భక్తుల రద్దీతో కిట కిట లాడాయి.అమ్మ వారి దర్శనం కోసం పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చే అవకాశం ఉందని గుర్తించిన మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఎప్పటి కప్పుడు అధికారులను సమన్వయం చేస్తూ ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు.లష్కర్ బోనాలకు ఎంతో ప్రాముఖ్యత ఉండటం తో మంత్రి తలసాని ఏర్పాట్ల విషయంలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టేలా అధికారులను అప్రమత్తం చేసారు.దీంతో ఆదివారం అమ్మ వారి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన క్యూలైన్ల లో భక్తులు తరలి వచ్చి అమ్మ వారి దర్శనాన్ని వేగంగా పూర్తి చేసుకోగలిగారు.గర్భాలయం నుంచి బయటకు వెళ్లేందుకు ఉన్న దారులను ఈ ఏడాది అదనంగా మరో దారి ఏర్పాటు చేయించడంతో వచ్చిన భక్తులు వచ్చినట్లు త్వరిత గతిన అమ్మ వారిని దర్శించుకుని ఆలయం నుంచి బయటకు వెళ్లగలిగారు.అమ్మ వారికి మంత్రి తలసాని కుటుంబంతో కల్సి వచ్చి ఉదయం గం 3.30నిలకు తొలిబోనం సమర్పించగా, ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరావు దంపతులు అమ్మ వారికి బోనం సమర్పించి పట్టు వస్త్రాలను అందజేసారు. పూజలు నిర్వహించారు. అనంతరం డిప్యూటీ స్పీకర్ తీగుళ్ల పద్మారావు గౌడ్ అమ్మ వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బంగారు బోనంతో ఆలయానికి వచ్చి బోనం సమర్పించి అమ్మవారికి పూజలు నిర్వహించారు. వీరితో పాటు హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ తమ కుటుంబంతో కల్సి వచ్చి అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.కేంద్ర మంత్రి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు కిషన్ రెడ్డి దంపతులు, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి దంపతులు అమ్మ వారికి బోనం సమర్పించి పూజలు నిర్వహించారు.మంత్రి మల్లారెడ్డి కుటుంబంతో వచ్చి బోనం సమర్పించారు.పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి కార్పోరేటర్ చీరె సుచిత్రా శ్రీకాంత్ దంపతులు స్వాగతం పలికి పూజలు నిర్వహింపజేసారు.ఎమ్మెల్యేలు ముఠాగోపాల్,మాగంటి గోపీనాథ్,కాలేరు వెంకటేష్, పద్మాదేవేందర్‌రెడ్డి,మల్లు భట్టి విక్రమార్క,మేయర్ గద్వాల విజయలక్ష్మి,డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతా శోభన్ రెడ్డి,మోండా కార్పోరేటర్ కొంతం దీపిక తదితరులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఉదయం సమయంలో భక్తులు కొంత పలుచగా కనిపించినా మధ్యాహ్నానికి క్యూలైన్లు నిండిపోయాయి. సాయంత్రానికి లక్షలాదిగా భక్తులు అమ్మ వారిని దర్శించుకున్నారు.తెలంగాణలో ఆషాడ మాసమంతా బోనాల జాతర ఉంటుంది. తొలి ఏకాదశి ముగిసిన తరు వాత బోనాల జాతర మొదలవుతుంది.ఈ నెలంతా హైదరాబాద్ నగరమంతా బోనాలు చేసుకుంటారు.వర్షాకాలంలో చేసుకునే ఈ పండుగకు ఒక ప్రత్యేకత ఉంది.ఈ కాలంలో జ్వరాలు,అంటు వ్యాధులు వ్యాపిస్తాయి.అలా జరగకుండా వాటి నుంచి ప్రజలు తమను రక్షించాలని ప్రతి ఒక్కరినీ ఆరోగ్యంగా ఉండేలా చూడాలని కోరుకుంటూ అమ్మ వారికి బోనం సమర్పిస్తే అంతా మంచి జరుగుతుందనేది భక్తుల నమ్మకం. పండుగ రోజున అమ్మ వారికి నిష్టగా బోనం అలంకరించి అందులో నైవేద్యం వండి డప్పుచప్పుళ్లతో వెళ్లి అమ్మ వారికి బోనం సమర్పిస్తారు.

కోలాహలంగా ఫలాహారం బండ్ల ఊరేగింపు.. జాతర సాయంత్రం అమ్మవారి ఆలయా నికి ఫలహారం బండ్ల ఊరేగింపు కోలాహలంగా సాగింది.ప్రతి వీధి నుంచి అమ్మ వారి ఆలయం వరకు ఫలహారం బండ్లు ఏర్పాటు చేసిన నిర్వహకులు ప్రసాదాలు పంచుతూ అమ్మ వారి ఆలయానికి చేరుకుంటారు.

నేడు రంగం.. బోనాల మరుసటి రోజు రంగం (భవిష్యవాణి) కార్యక్రమం ఉంటుంది.అవివాహిత మహిళ అమ్మ వారి ఆలయం ఎదురుగా ఉండే ఆలయం ముందు పచ్చికుండపై నిల్చుని అమ్మవారిని ఆవాహనం చేసుకుంటారు.ఈ సందర్భంగా తెలంగాణా భవిష్యత్ ను చెబుతుంది.వర్షాలు ఎలా కురుస్తాయి.పంటల సాగు ఎలా ఉండబోతుంది.ఈ కార్యక్రమానికి ఇప్పటికే ఆలయానికి సంబంధించి ఏర్పాట్లు చేసారు.

భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేసాం : మంత్రి తలసాని

ఉజ్జయినీ మహాకాళీ ఆషాడ బోనాల జాతరకు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశ,విదేశాల నుంచి లక్షలాదిగా భక్తులు తరలి వచ్చారని,వారిందరికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా క్యూలైన్లు ఏర్పాటు చేసామని, ముఖ్యమంత్రి కెసిఆర్ బోనాల జాతరను రాష్ట్ర పండువగా ప్రకటించి నిధులు విడుదల చేసారని,ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాతర సాగిందన్నారు.

ప్రశాంత వాతావరణంలో జాతర నిర్వహించాం : మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి.

లష్కర్ ఆషాడ బోనాల జాతర ప్రశాంత వాతావరణంలో నిర్వహిం చామని దేవాదాయ ధర్మాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. అమ్మవారి దర్శనం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ముఖ్య మంత్రి బోనాలకు 15కోట్ల రూపాయల నిధులను ఇచ్చి ప్రోత్సహించడం అభినందనీయమ న్నారు. ఇప్పటికే రెండు వేల ఆలయాలకు పైగా చెక్కులను కూడా పంపిణీ చేసామని ఆయన తెలిపారు. మళ్లీ ముఖ్యమంత్రిగా కేసీఆర్ ను ప్రజలు దీవించాలని కోరారు.

వచ్చే ఎన్నికల్లో తెలంగాణాలో బిజేపీ ప్రభుత్వం : ఈటెల రాజేందర్

వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడబోతుందని అమ్మ వారి ఆశీస్సులతో రాష్ట్రంలో తప్పక బీజేపీ ప్రభుత్వం ఏర్పడుతుందని బీజేపీ నాయకులు ఈటెల రాజేందర్ అన్నారు. తెలంగాణా ప్రజలు సుభిక్షంగా ఉండాలని తాను అమ్మ వారిని కోరుకున్నట్లు ఆయన తెలిపారు.



డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ నివాస సమీపంలోని అమ్మవారి దేవాలయంలో పూజలు చేస్తున్న సిఎం కేసిఆర్, కెసిఆర్ సతీమణి శోభ, ఎమ్మెల్సీ కవిత

డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ ఇంటికి సిఎం కెసిఆర్

కంటోన్మెంట్, జూలై 9 ప్రభాతవార్త: సికింద్రాబాద్ ఉజ్జయిని మహాకాళి జాతర మహోత్సవాలను పురస్కరించుకొని ఆదివారం సికింద్రాబాద్ మోండా మార్కెట్ టకార బస్తీలోని డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ నివాసంలో జరిగిన బోనాల వేడుకలకు రాష్ట్ర ముఖ్య మంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావ్ (కేసిఆర్), దంపతులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొని ఆయన నివాసం ప్రాంగణంలో ఉన్న అమ్మవారి అలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ నివాసంలో ఏర్పాటు చేసిన విందు భోజనంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు మంత్రులు, తలసాని శ్రీనివాస్ యాదవ్, మహమూద్ అలీ, సి.హెచ్.మల్లారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీలు కల్వకుంట్ల కవిత, పల్ల రాజేశ్వర్ రెడ్డి, బిఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌ఛార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి, సికింద్రాబాద్ పార్లమెంట్ బిఆర్ఎస్ ఇన్‌ఛార్జి తలసాని సాయికిరణ్ యాదవ్, ఎమ్మెల్యేలు మాగంట గోపినాథ్, కాలేరు వెంకటేశ్, గ్రేటర్ మేయర్ గద్వాల విజయ లక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్ రెడ్డి, ముఠా గోపాల్, మాదవరం క్రిష్ణారావ్, బేవరేజెస్ కార్పోరేషన్ చైర్మన్ గజ్జెల నాగేశ్, కంటోన్మెంట్ నియోజకవర్గం దివంగత ఎమ్మెల్యే సాయన్న కూతుర్లు లాస్య నందిత, నివేదిత, కార్పోరేటర్లు లింగాని ప్రసన్న శ్రీనివాస్, సామల హేమ, ఆర్.సునీతలతో పాటు వేలాది మంది బిఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఉజ్జయిని మహాంకాళి దయతో తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి

రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్

చిక్కడపల్లి, జూలై 9 ప్రభాతవార్త: ఉజ్జయిని మహాంకాళి దయవల్ల తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, అందరిని చల్లగా చూడాలని కోరుకోవడం జరిగిందని బిజెపి పార్లమెంటరీ బోర్డు సభ్యుడు, రాజ్యసభసభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. లష్కర్ బోనాల సందర్భంగా ఆదివారం సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాంకాళి అమ్మ వారి ఆలయాన్ని బిజెవైఎం పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు గుండగోని భరత్‌గౌడ్‌తో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు అంతకుముందు స్వాగతం పలికి అర్చనలు, తీర్థప్రసాదాలను అందించారు.

అమ్మవారిని దర్శించుకున్న రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్

సిటీ కళాశాలలో ఘనంగా ఎబివిపి 75వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

చార్మినార్, జూలై 9 ప్రభాతవార్త : ప్రభుత్వ సిటీ కళాశాలలో ఆదివారం ఎబివిపి 75వ సంవత్సరం ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎబివిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కమల్ సురేష్ మాట్లాడుతూ 1949 జూలై 9వ తేదీన ఢిల్లీ విశ్వవిద్యాలయంలో ప్రారంభించబడిన ఏబివిపి నేడు దేశంలోని నలు మూలల వ్యాపించిందని తెలిపారు. విద్యార్థుల సమస్యల పోరాటం కోసం నిత్యం ఏబివిపి ముందు ఉంటుందని ఆయన తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కోఠీ జిల్లా కన్వీనర్ సభావట్ కళ్యాణ్ కుమార్,చార్మినార్ నగర కార్యదర్శి బొమ్మిడి నితిన్, కళాశాల అధ్యక్షులు దిలీప్, కార్యదర్శి సజన్,ఉపాధ్యక్షులు వాసు, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ శ్రీకాంత్, విద్యార్థి నాయకులు అనసూయ,ప్రియాంక, రాహుల్,రుసేంద్ర, విష్ణు,అఖిల్,గిరీష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

ఆకాశాన్నంటుతున్న కూరగాయల ధరలు

కూర కారమై.. ఆర్థిక భారమై

అల్లం, ఎల్లిగడ్డ అయితే మరీ దారుణం

అల్లం కిలోకు రూ.300, ఎల్లిగడ్డ రూ.200లు

టమాట, బీన్స్, పచ్చిమిర్చి రూ.150 చొప్పున

హైదరాబాద్, జులై 9 ప్రభాతవార్త : కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. మరీ ముఖ్యంగా అల్లం, ఎల్లిగడ్డ, టమాట ధరలు మరీ దారుణంగా పెరిగాయి. మిర్చి రేటు ఘాటెక్కిస్తోంది. ముట్టుకోకుండానే మంటెక్కిస్తోంది. రైతు బజారులోనే కిలో రూ.140 పలుకుతున్న పచ్చి మిర్చి..ఇళ్ల దగ్గర దుకాణాల్లో మాత్రం పరేషాన్ చేస్తోంది. ఒక్కోచోట 150 రూపాయలు కూడా పలుకుతోంది. ఇక టమాటా కిలో 150 రూపాయలకు తగ్గడం లేదు. ఇవి మాత్రమే కాదు..బీన్స్, క్యాప్సికం, కాకరకాయ, క్యారెట్.. ఏవి కొనాలన్నా జేబులకు చిల్లులు తప్పడంలేదు. నోరు కట్టేసుకుందామంటే కుదరదు. కనీసం చారు, సాంబారుతో కానిచ్చేద్దామనుకున్నా..ఒక్క టమాటా అయినా వేయకపోతే రుచి ఉండదు. సాంబారు నీళ్లకూ కష్టకాలమొచ్చిందిలా అని జనం అల్లాడిపోతున్నారు. ఒకప్పుడు 200 పెడితే కూరగాయలతో సంచి నిండిపోయేది. ఇప్పుడు వెజిటబుల్స్‌ను హ్యాండ్ బ్యాగుల్లో సర్థాల్సి వస్తోంది. కూరగాయల ఉత్పత్తి బాగా తగ్గడంతో కాయగూరల ధరలు మండుతున్నాయి. మార్కెట్‌లో కూరగాయలు సామాన్యుడికి అందుబాటులో లేకుండా పోయాయి. బీన్స్, పచ్చి మిర్చి, టమాట మినహా ఏది కొన్నా కిలో రూ.80 నుంచి రూ.100 వరకు తక్కువ లేకపోవడంతో పేద, మధ్యతరగతి ప్రజలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పుడే ధరలు ఎలా ఉంటే వర్షకాలంలో ఇంకా ఎక్కువగా పెరిగే అవకాశం ఉంది. ఇంట్లో నలుగురైదుగురు కుటుంబసభ్యులు ఉంటే రోజు కిలో చొప్పున కూరగాయల వినియోగం ఉంటుంది.

కూరగాయలు కొనాలంటే ప్రజలు బెంబేలెత్తిపోయే పరిస్థితి ఏర్పడింది. హోల్‌సేల్ మార్కెట్లో కాస్త తక్కువ ఉన్నట్లు కనిపించినా రిటైల్ మార్కెట్, షాపింగ్ మాల్స్, ఆన్‌లైన్‌లో ధరలు మండిపోతున్నాయి. కొనబోతే కొరిమి అన్నట్లుందని, ఎక్కడ చూసినా కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని పలువురు మహిళలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. రైతు బజార్లలో ఒకరేటు, బస్తీల, కాలనీలలో కూరగాయల మార్కెట్‌లలో మరోరేట్లు ఉంటున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూరగాయల ధరలు తగ్గించేందుకు ప్రభుత్వం, సంబంధిత అధికారులు తగిన చొరవ తీసుకోవాలంటున్నారు. రాజకీయ పార్టీలు ఎన్ని ఉన్నా ధరలు తగ్గించేందుకు ఏ ఒక్కరు కృషిచేసిన పాపాన పోలేదంటున్నారు. ఏంకొనేటట్టు లేదు..ఏం తినేటట్టు లేదని సామాన్యులు వాపోతున్నారు. కూరగాయల ధరలు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయి. గుడిమల్కాపూర్, బోయిన్‌పల్లి, సికింద్రాబాద్ మోండా, మాదన్నపేట వంటి మార్కెట్‌లతో పాటు గ్రేటర్ పరిధిలోని 11 రైతు బజార్లకు రోజువారీగా దిగుమతి కూరగాయల రాక తగ్గిపోయింది. దీంతో ధరలు విపరీతంగా పెరిగాయి. నగర జనాభా ప్రకారం ప్రతి రోజు సుమారు మూడు వేల టన్నుల కూరగాయలు అవసరం. నగరానికి కూరగాయ దిగుమతి తెలంగాణ జిల్లాల నుంచే కాకుండా కర్నూలు, చిత్తూరు, అనంతపురం, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి దిగుమతి అవుతాయి. కూరగాయల దిగుబడి భారీగా తగ్గిందని, దీంతో ఎన్నడూలేని విధంగా కూరగాయల ధరలు పెరిగాయని వ్యాపారులు పేర్కొంటున్నారు.

వంకాయ, బీరకాయ, బెండకాయ లాంటి రెగ్యులర్‌గా వినియోగించే కూరగాయల ధరలు సగటున కిలోకు రూ.50 చొప్పున ఉండేవి. ఇప్పుడు రూ.20-రూ.30 చొప్పున అదనంగా ధరలు పలుకుతున్నాయి. దీంతో వినియోగదారులు కూరగాయలు కొనటాన్ని ఆర్థికభారంగా భావిస్తున్నారు. రైతులు తెచ్చిన కూరగాయలు వినియోగదారుల వద్దకు వచ్చేసరికి ఈ ధరలు రెట్టింపు అవుతున్నాయి. టమాట రూ.150లు,బీన్స్ రూ.140లు, బీట్‌రూట్ రూ.70లు, క్యారెట్ రూ.80లు, కాలీఫ్లవర్ రూ.60లు, క్యాప్సికం రూ.90లు, కాకరకాయలు రూ.90లు, బెండకాయలు రూ.70లు, సొరకాయలు రూ.35లు, దొండకాలయలు రూ.60లు, బీరకాయలు రూ.70ల చొప్పున అమ్ముతున్నారు. మార్కెట్లో వీటి ధరల బోర్డును చూసిన జనం బెంబేలెత్తిపోతున్నారు. ఇలా అయితే కూరగాయలు కొనేది ఎలా అంటూ వాపోతున్నారు. అసలే పన్నుల భారం, దీనికి తోడు పెట్రోల్ ధరలతో పాటు కూరగాయలు,ఆకుకూరలు కూడా వాతపెట్టడంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మరోవైపు గత ఏడాది కన్నా ఉల్లి కొరత ఎక్కువ కావచ్చని కేంద్ర ప్రభుత్వం ఎగుమతులను నిలిపివేసింది.ఇప్పటికే రూ.100లకు మూడు కిలోల చొప్పున ఉల్లిగడ్డ అమ్ముతున్నారు.త్వరలో ఉల్లి ధరలు కూడా పెరగనున్నాయని వ్యాపారులు పేర్కొంటున్నారు. మొన్నటివరకు తీవ్ర ఉష్ణోగ్రతల తాకిడికి దెబ్బతినగా మిగిలిన కూరగాయలను రైతులు మార్కెట్‌కు తీసుకొస్తున్నారు. రైతులు తెచ్చిన కూరగాయలు నాణ్యత లేదంటూ వ్యాపారులు హోల్‌సేల్ ధరలు తగ్గిస్తున్నారు.వేసవి తాకిడికి కూరగాయల నాణ్యత దెబ్బతిన్నాయని సాకుగా చూపించి రైతుల నుంచి వ్యాపారులు, దళారులు తక్కువ ధరకు వాటిని కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులు నష్టపోతున్నారు. ఇక వినియోగదారులకు మాత్రం అధిక ధరలకు అమ్ముతున్నారు. ఇటు వినియోగదారులు, ఆటు రైతులు నష్టపోతుండగా.. దళారులు, వ్యాపారులు మాత్రం మధ్యలో లబ్ధి పొందుతున్నారు.

బోయిన్‌పల్లి మార్కెట్‌లో టోకు మార్కెట్‌కు ఉత్తరప్రదేశ్ నుంచి33 వాహనాలు, మహారాష్ట్ర నుంచి 54, కర్ణాటక నుంచి 84, ఎంపి నుంచి 69 వాహనాల్లో కూరగాయలు వచ్చాయి. మొత్తం 1530 క్వింటాళ్ల టమాటాలు రాగా అందులో 335 క్వింటాళ్లే తెలంగాణలో పండినవి. మిగతావన్నీ మహారాష్ట్ర, కర్ణాటక, ఎపిల నుంచే వచ్చాయి. కూరగాయల సాగు విస్తీర్ణం, దిగుబడులు పెరగకపోవడం వల్ల ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. గత వేసవిలో కూరగాయల సాగు పెంచేందుకు రాష్ట్ర ఉద్యానశాఖ శ్రద్ధ చూపలేదు. ఫలితంగా ఇప్పుడు ఇతర రాష్ట్రాల కూరగాయలే దిక్కయ్యాయి. కొన్ని రకాలైతే దాదాపు 80 శాతం బయటి రాష్ట్రాల నుంచే వస్తున్నట్లు మార్కెటింగ్ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. అధిక ధరల నివారణకు కూరగాయల దిగుబడి పెంచాల్సిన అవసరం ఉందని పలువురు పేర్కొంటున్నారు.ఇప్పుడే ధరలు ఇంతలా ఉండే వచ్చే వర్షకాలంలో ఎంత ఎక్కువగా ఉంటాయోనని వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు.ధరల పెరుగుదలకు సామాన్యులకు మాత్రం ఇబ్బందులు తప్పడంలేదు. ఇప్పటికైనా ధరలు తగ్గించేందుకు కృషిచేసి ప్రతి కుటుంబంలో ఉత్సాహం నింపేలా చూడాలని వినియోగదారులు కోరుతున్నారు.కొత్త పంట చేతికి వచ్చేవరకు ధర పెంపు తప్పదని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

బిసిల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న ప్రభుత్వం

హోంశాఖ మంత్రి మహమూద్ అలీ

హెయిర్ సెలూన్‌లో హోంశాఖ మంత్రి మహమూద్ అలీకి కటింగ్ చేస్తున్న బిఆర్ఎస్ నాయకులు అనిల్

చార్మినార్, జూలై 9 ప్రభాతవార్త : బిసిల అభ్యున్నతి కోసం ప్రభుత్వం అన్ని విధాల కృషి చేస్తున్నదని రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్ అలీ అన్నారు.చార్మినార్ నియోజకవర్గం కాలీకబర్ ప్రాంతం నివాసి సీనియర్ బిఆర్ఎస్ నాయకులు అనిల్ కుమార్‌కు చెందిన హెయిర్ సెలూన్ షాపును రాష్ట్ర హోంశాఖ మంత్రి ఆదివారం ప్రారంభించారు.అనంతరం షాపులో హోంశాఖ మంత్రి మహమూద్ అలీకి బిఆర్ఎస్ నాయకులు అనిల్ కుమార్ కటింగ్ చేశారు.ఈ సందర్భంగా హోంశాఖ మంత్రి మహమూద్ అలీ మాట్లాడుతూ ప్రభుత్వం బిసిల సంక్షేమం కోసం పాటు పడుతున్నదని తెలిపారు.ఎమ్మెల్సీ మీర్జా రియాజ్ ఉల్ హసన్ ఎఫెందీ,హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇంఛార్జి పుస్తె శ్రీ కాంత్, సీనియర్ బిఆర్ఎస్ నాయకులు సయ్యద్ లాయక్ అలీ,రజా అలీ మీర్జాతో పాటు పలువురు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు సహాయ సహకారాలు అందించేందుకు ముందుకు రావాలి : ఈటల రాజేందర్

కంటోన్మెంట్, జూలై 9 ప్రభాతవార్త: పేద విద్యార్థులకు సహాయ సహకారాలు అందించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని బిజెపి ఎన్నికల కమిటీ మేనేజ్ మెంట్ చైర్మన్ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్ తెలిపారు. సికింద్రాబాద్‌కు చెందిన బిజెపి సీనియర్ నాయకుడు మద్దెల శ్యామ్ సుందర్ ఆధ్వర్యంలో 35 మంది పేద విద్యార్థులకు స్కూల్ ఫీజులు తెప్పించడంతో పాటు నోటు పుస్తకాలు, స్కూల్ బ్యాగ్‌ల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదివి ఏఎస్, ఐపిఎస్ వంటి చదువులో చదివేందుకు తగిన ప్రోత్సాహాన్ని అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మహంకాలి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాని, అడ్డగుట్టకు చెందిన బిజెపి నాయకులు మహేశ్ గౌడ్, గెల్లు ఉదయ్ యాదవ్, సాయిబాబా పాల్గొన్నారు.

లాల్‌దర్వాజ బోనాల జాతర 2023 సిడి ఆవిష్కరణ

చాంద్రాయణగుట్ట, జూలై 9 ప్రభాతవార్త : చారిత్రాత్మక లాల్‌దర్వాజ శ్రీ సింహవాహిణి అమ్మవారిని కీర్తిస్తూ రూపొందించిన బోనాల జాతర ఉత్సవాల 2023 సిడిని ఆదివారం ఉదయం ఆలయ అర్చకులు కార్తికేయ శర్మ, ఛత్రినాక ఇన్స్పెక్టర్ భోజ్యా నాయక్, ఆలయ చైర్మన్ సి.రాజేందర్ యాదవ్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన కార్యదర్శి బి.మారుతీ యాదవ్, కమిటీ సభ్యులు పోసాని సదానంద్ ముదిరాజ్, అరవింద్ కుమార్ గౌడ్, ఏ.మాణిక్ ప్రభు గౌడ్, విష్ణుగౌడ్, కె.వెంకటేష్, కాశీనాథ్ గౌడ్, తిరుపతి నర్సింగ్ రావు పాల్గొన్నారు.

నగర కేంద్రగ్రంథాలయం రేణుక ఎల్లమ్మ గుడిలో బోనాల ఉత్సవాలు

చిక్కడపల్లి, జూలై 9 ప్రభాతవార్త: అశోక్‌నగర్ నగర కేంద్రగ్రంథాలయం ఆవరణలో ఉన్న రేణుక ఎల్లమ్మ దేవాలయంలో బోనాలు ఉత్సవాలను ఘనంగా నిర్వహించబోతున్నట్లు నగర కేంద్ర గ్రంథాలయ సంస్థ టిఎన్జీఓస్ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శాగంటి అయోధ్య, బొల్లం మహేందర్ వివరించారు. 11న జరిగే ఈ ఉత్సవాలకు అతిథులుగా తెలంగాణ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ అయాచితం శ్రీధర్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, టిఎన్జీఓస్ సెంట్రల్ యూనియన్ అధ్యక్షుడు ఎం.రాజేందర్, ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్, పౌరగ్రంథాలయల శాఖ డైరెక్టర్ శ్రీనివాస్‌చారి,గాంధీనగర్ కార్పొరేటర్ పావనీ వినయకుమార్, టిఎన్జీఓస్ జిల్లా అధ్యక్షుడు ముజీబ్, కార్యదర్శి విక్రమ్, నగర కేంద్ర కార్యదర్శి పద్మజ పాల్గొంటారన్నారు. పెద్దఎత్తున హాజరు కావాలని కోరారు.

బిసి, ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి

బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జిల్లపల్లి అంజీ డిమాండ్

సైఫాబాద్, జులై 9 ప్రభాతవార్త: రాష్ట్రంలో బిసి, ఎస్సీ, ఎస్టీ హాస్టల్ విద్యార్థులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించి, అమలు చేయాలని తెలంగాణ బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర కమిటి డిమాండ్ చేసింది. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని విద్యార్థి సంఘాలతో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని కమిటి హెచ్చరించింది. బిసి, ఎస్సీ, ఎస్టీ హాస్టల్ విద్యార్థులకు పెంచిన మెస్ చార్జీలను తక్షణమే అమలు చేయాలని బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జిల్లపల్లి అంజీ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం నాడిక్కడ మీడియాతో ఆయన మాట్లాడుతూ పెంచిన 2 వేల రూపాయల మెనును అమలు చేయాలని, అలాగే పెండింగ్‌లో ఉన్న ఫీజుల రీయంబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్‌లు 5 వేల కోట్ల రూపాయలను వెంటనే విడుదల చేయాలని కోరారు. బిసి విద్యారులకు స్కాలర్‌షిప్‌లు 5500 నుంచి 20 వేలకు పెంచాలని, బిసి హాస్టల్స్‌కు గురుకులాలకు సొంత భవనాలు 119 నిర్మించాలని, అన్ని స్కూల్స్, కళాశాలలు, యూనివర్సిటిలలో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని, మౌలిక సదుపాయాలను కల్పిలంచాలని ఆయన డిమాండ్ చేశారు.

కంటోన్మెంట్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

మన్నె క్రిషాంక్

7వ వార్డు చిన్నకమేళాలో 16వ బస్తీ నిద్రలో పాల్గొన్న మన్నె క్రిషాంక్

కంటోన్మెంట్,జులై 9 ప్రభాతవార్త: కంటోన్మెంట్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలో ్ల నెలకొన్న సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తామని తెలంగాణ రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ చైర్మన్ మన్నెక్రిషాంక్ తెలిపారు. శనివారం రాత్రి 7వ వార్డులోని చిన్న కమేళాలో నిర్వహించిన 16వ బస్తీ నిద్ర కార్యక్రమం విజయవంతంగా సాగింది. 350 మంది స్థానికులు పాల్గొని వారు ఎదుర్కొంటున్న సమస్యలను వారి దృష్టికి తెచ్చారు. రోడ్లు,డ్రైనేజీ, మంచినీరు వంటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ బోర్డు సభ్యుడు ప్యారసాని శ్యామ్ కుమార్, బిఆర్ఎస్ నాయకులు జాన్, వేణు, సరిత, విజయ్ కుమార్,సాయి, రఘు, రాజు తదితరులు పాల్గొన్నారు.

బోనాల వేడుకల్లో పాల్గొన్న మన్నె క్రిషాంక్.. ఉజ్జయిని మహాకాలి జాతర మహోత్సవాలను పురస్కరించుకొని ఆదివారం రెజిమెంటల్ బజార్,కంటోన్మెంట్ 5వ వార్డు మహాత్మగాంధీ నగర్, బాపూజీ నగర్, సిఖ్ విలేజ్, శివాజీ నగర్ పరిసర ప్రాంతాల్లోని అమ్మవారి దేవాలయాల్లో నిర్వహించిన బోనాల వేడుకల్లో మన్నె క్రిషాంక్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మైనార్టీలు విద్యా పరంగా మరింత అభివృద్ధి చెందాలి

ఎంపి అసదుద్దీన్ ఓవైసీ

కార్యక్రమంలో పాల్గొన్న ఎంపి అసదుద్దీన్ ఓవైసీ,కాట్ అకాడమీ డైరెక్టర్ మహ్మద్ అన్వర్ తదితరులు

చార్మినార్,జూలై 9 ప్రభాతవార్త : మైనార్టీలు విద్యా పరంగా మరింత అభివృద్ధి చెందవలసిన అవసరం ఎంతైనా ఉందని ఎంఐఎం అధినేత, హైదరాబాద్ పార్లమెంట్ సభ్యులు అసదుద్దీన్ ఓవైసీ అన్నారు. పాతబస్తీ కిషన్‌బాగ్‌కు చెందిన కాట్ అకాడమీ డైరెక్టర్ మహ్మద్ అన్వర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. కాట్ అకాడమీ తరుపున ఎంపికైన హాంగ్ కాంగ్‌లోని అంతరిక్ష కేంద్రం,సైన్సు మ్యూజియంను సందర్శించటానికి వెళుతున్న విద్యార్థులను ఆయన అభినందించారు.ఎంపి జెండా ఊపి యాత్రను ప్రారంభించారు.ఈ సందర్భంగా కాట్ అకాడమీ డైరెక్టర్ మహ్మద్ అన్వర్ మాట్లాడుతూ పేద విద్యార్థులను విద్యా పరంగా ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో పోటీ పరీక్షలలో ఎంపికైన ఇరవై ఒక్క మంది ఎమెర్జింగ్ శాస్త్ర వేత్తలను అంతరిక్ష కేంద్రానికి తీసుకెళ్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాలల కరస్మాండెట్లు మహ్మద్ మస్తాన్,వికారుద్దీన్,ఖలీల్ ఉర్ రెహ్మాన్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో అన్ని పార్టీలు ముస్లిం డిక్లరేషన్ ప్రకటించాలి

తెలంగాణ ముస్లిం సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ

'ముస్లిం డిక్లరేషన్"ను ఆవిష్కరిస్తున్న వారగోపాల్, జమీరుద్దీన్

హైదరాబాద్, జూలై 9,ప్రభాతవార్త: వచ్చే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని పార్టీలు ముస్లిం డిక్లరేషన్ ప్రకటించాలని తెలంగాణ ముస్లిం సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ డిమాండ్ చేసింది. ఈమేరకు ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జేఏసీ కన్వీనర్ సలీమ్ పాషా, కోకన్వీనర్ స్కై బాబాల ఆధ్వర్యంలోని కమిటీ రూపొందించిన "ముస్లిం డిక్లరేషన్ "పుస్తకాన్ని ప్రొఫెసర్ హరగోపాల్, సీనియర్ పాత్రికేయులు జహీరుద్దీన్ అలీఖాన్‌లు ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జూన్ 25 2023న హైదరాబాద్‌లోని మదీన ఎడ్యూకేషనల్ సెంటర్‌లో జరిగిన ముస్లిం మేధావుల మేథో మథనం తరువాత ఈడిక్లరేషన్ రూపొందించామన్నారు. తెలంగాణలో ముస్లిం కమ్యూనిటీ ఓట్లు దాదాపు 13శాతం కంటే ఎక్కువ కలిగి ఉందని రాష్ట్రంలోని 40 నియోజకవర్గాల్లో గెలుపోటములు ప్రభావితం చేసే నిర్ణయాత్మక శక్తిగా ఉందన్నారు. అయినప్పటికీ ప్రభుత్వాలు వీరిని ఓటుబ్యాంకుగానే చూస్తూ అన్యాయం చేస్తూ వస్తున్నాయన్నారు. జస్టిస్ సచార్ కమిటీ, రంఫనాథ్ మిశ్రా కమిషన్, రాష్ట్రంలో సుధీర్ కమిషన్ తెలంగాణ తొలి బిసి కమిషన్ ముస్లింల వెనబాటు తనాన్ని స్పష్టంగా తేల్చి చెప్పాయన్నారు. ఈసమావేశంలో జేఏసీ ప్రతినిధులు కోఆర్డినేటర్ మహ్మద్ యూనస్, కోర్ కమిటీ మెంబర్లు ప్రొఫెసర్ ఎండీ అన్సారీ, షేక్ పారుఖ్ హుస్సేన్, వలీ ఉస్సేన్, హనీఫ్ హుస్సేన్ తదితరలు పాల్గొన్నారు.

బోయిన్‌పల్లి మార్కెట్‌లో ఘనంగా బోనాల ఉత్సవాలు

మహాకాళి దేవాలయంలో పూజలు చేస్తున్న మంత్రి ఇంద్రకరన్ రెడ్డి, బిఆర్ఎస్ ఇన్‌ఛార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి తదితరులు

అడ్డగుట్ట, జూలై 9 ప్రభాతవార్త: అషాడమాస బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని ఆదివారం బోయిన్‌పల్లి మార్కెట్ యార్డులో నిర్వహించిన బోనాల మహోత్సవ వేడుకలకు మల్కాజిగిరి పార్లమెంట్ బిఆర్ఎస్ ఇన్‌ఛార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి, మార్కెట్ చైర్మన్ హారిక ఆనంద్ బాబు, డైరెక్టర్లు బత్తుల నారాయణ, సుషాంత్ రెడ్డి, నయీం, శ్రీనివాస్ గౌడ్, బిఆర్ఎస్ నాయకులు ముప్పిడి మధుకర్, పోచయ్య, టింకూ గౌడ్, అజయ్, సురేశ్, ఎసోమయ్య, ఏఐటియుసి నేత నర్సింహ్మ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ఇంద్రకరన్ రెడ్డితో పూజలు చేస్తున్న బిఆర్ఎస్ ఇన్‌ఛార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి

సికింద్రాబాద్ ఉజ్జయిని మహాకాలి జాతర మహోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం జరిగిన బోనాల జాతర వేడుకల్లో రాష్ట్ర దేవదాయ, ధర్మదాయ శాఖ మంత్రి ఇంద్రకరన్ రెడ్డి, మల్కాజిగిరి పార్లమెంట్ బిఆర్ఎస్ ఇన్‌ఛార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి, బేవరేజెస్ కార్పోరేషన్ చైర్మన్ గజ్జెల నాగేశ్, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి, మాజీ బోర్డు సభ్యుడు పాండు యాదవ్‌లతో కలిసి పూజలు నిర్వహించారు. అదే విధంగా రెజిమెంటల్ బజార్ 5వ వార్డు మహాత్మగాంధీ నగర్, బాపూజీ నగర్, పరిసర ప్రాంతాల్లో నిర్వహించిన బోనాల వేడుకల్లో మర్రి రాజశేఖర్ రెడ్డి, అంబర్ పేట్ ఎమ్మెల్యే కాలేర్ వెంకటేశ్‌లు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రజలు నేస్తం కాంగ్రెస్: డిసిసి అధ్యక్షుడు నందికంటి శ్రీధర్

అల్వాల్, జూలై 9 ప్రభాతవార్త: కాంగ్రెస్ హస్తం ప్రజలు నేస్తం పేరిట డిసిసి అధ్యక్షుడు నందికంటి శీధర్ మల్కాజిగిరి నియోజకవర్గంలో పాదయాత్ర నిర్వహిస్తున్నారు. పాదయాత్రలో బాగంగా వెంకటాపురం డివిజన్ పరిధిలోని వెస్ట్ వెంకటాపురం, దినకర్ నగర్, జోషి నగర్‌లలో పర్యటించిన ఆయనకు మురికి కాలువలు, రోడ్లు, మంచినీరు తదితర సమస్యలను ప్రజలు నందికంటికి వివరించారు. అన్ని వర్గాలు శ్రేయస్సు కోసం పని చేసేది కేవలం కాంగ్రెస్ పార్టీ మాత్రమే అని ఆయన తెలిపారు. ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పేద బలహీన వర్గాలు టిఆర్ఎస్ పాలనతో విసుగు చెంది ఉన్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని అధిక శాతం మంది ప్రజలు కోరుకుంటున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నేతలు చంద్రశేఖర్, సిఎల్ యాదగిరి, అశోక్‌రెడ్డి, కృష్ణగౌడ్, సంజీవ్ కుమార్, శ్రీనివాస్, శివకుమార్, వీనస్ మేరి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

మోదీ తెలంగాణ పర్యటనతో ఓరింగింది ఏమిలేదు

సైఫాబాద్, జులై 9 ప్రభాతవార్త: ప్రధాని నరేంద్రమోదీ వరంగల్ పర్యటన వల్ల తెలంగాణ ప్రజలకు పెద్దగా ఓరి గింది ఏమిలేదని లోక్‌దళ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పి.వెంకటరాజేశ్వర్‌రావు ఆరోపించారు. గత 9 సంవత్సరాల నుంచి విభజన చట్టం హామీలను అమలు చేయలేదని, వాటి గురించి కనీసం మాట మాత్రం కూడా మాట్లాడకుండా బిఆర్ఎస్ ప్రభుత్వం అవినీతిలో ఉందని ఆరోపణలు చేశారని ఆయన విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతున్నదని, విభజన హామీలను కూడా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తే తెలంగాణ ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. విభజన హామీలను అమలు చేయకుండా ప్రధాని ఎన్ని వ్యాఖ్యలు చేసినా వృదాయేనని ఆరోపించారు.

సమస్యలపై ఎమ్మెల్యే పాదయాత్ర

గోల్నాక డివిజన్‌లో ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

హైదరాబాద్, జులై 9 ప్రభాతవార్త: అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఆదివారం గోల్నాక డివిజన్‌లోని వివిధ బస్తీలలో విస్తృతంగా పాదయాత్ర నిర్వహించారు. లాల్‌బాగ్, దోబిఘాట్, నవాబ్‌సాబ్ వాడలో పాదయాత్ర చేపట్టి ప్రజలతో మమేకమై వారు ఎదుర్కొంటున్న సమస్య లను అడిగి తెలుసుకున్నారు. బస్తీల ప్రజలు డ్రైనేజీ, మంచి నీటి పైప్‌లైన్‌లు, దోబిఘాట్‌లు, సిసి రోడ్లు, వీధీ దీపాలు, విద్యుత్ స్తాంబాలు ఏర్పాటు, పారిశుద్ధ్య పనుల గురించి ఎమ్మెల్యేకు వివరించారు. పై సమస్యలన్నింటిని పరిష్క రించాలని ఆయన అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యాధులు రాకుండా ముందుగా చర్యలు తీసుకోవాలి

కార్పొరేటర్ మహాలక్ష్మీరామన్‌గౌడ్ పిలుపు

హైదరాబాద్, జులై 9 ప్రభాతవార్త: హిమాయత్‌నగర్ డివిజన్‌లో డెంగ్యూ, మలేరియా తదితర విషజ్వరాలు రాకుండా ముందుగా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని డివిజన్ కార్పోరేటర్ జి.మహాలక్ష్మీరామన్‌గౌడ్ సూచించారు. ఆదివారం డివిజన్‌లోని ముత్యాల్‌బాగ్‌లో ఆమె ఎంటమాలజీ డిపార్ట్‌మెంట్ అధికారులు, సిబ్బందితో కలిసి పరిసరా ల పరిశుభ్రత-దోమల నివారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరా లను పరిశుభ్రంగా ఉంచుకుంటే దోమలను రాకుండా నివారించుకోవచ్చునని, దీంతో డెంగ్యూ, మలేరియా తదితర వ్యాధులు రాకుండా జాగ్రత్తప డవచ్చునని సూచించారు. డెం గ్యూ, మలేరియా వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్తగా ఎంటమాలజీ విభాగం అవగాహన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జి.రామన్‌గౌడ్, నగర నాయకులు వెంకటేష్, నర్సింగ్‌గౌడ్, సుజాత, జగదీష్, హితేష్, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

నల్లపోచమ్మ దేవాలయంలో అమ్మవారి ఘట స్థాపన

బోనాల ఉత్సవాలలో పాల్గొన్న చార్మినార్ ఏసిపి రుద్ర భాస్కర్,హుస్సేనీఆలం సిఐ నరేష్ కుమార్ తదితరులు

చార్మినార్,జూలై 9 ప్రభాతవార్త : పాతబస్తీ కసారట్టలోని శ్రీ నల్ల పోచమ్మ దేవాలయంలో వైభవంగా ఆషాడ మాస బోనాల జాతర ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.ఆదివారం మందిరంలో అమ్మవారి ఘటస్థాపన కార్యక్రమం జరిగింది.చార్మినార్ ఏసిపి రుద్ర భాస్కర్,హుస్సేనీఆలం సిఐ నరేష్ కుమార్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.దేవాలయం కమిటి కె.జ్ఞానేశ్వర్ ఏసిపి రుద్ర భాస్కర్,సిఐ నరేష్ కుమార్‌లను శాలువ కప్పి సన్మానించారు.ఈ కార్యక్రమంలో దేవాలయం కమిటి ప్రతినిధులతో పాటు పలువురు పాల్గొన్నారు.

మైలార్‌దేవ్‌పల్లిలో ఘనంగా బోనాలు

మైలార్‌దేవ్‌పల్లి, జూలై 9 ప్రభాతవార్త : మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని దుర్గామాత,కట్టమైసమ్మ,నల్ల మైసమ్మ,లక్ష్మీ గూడ,బృందావన్ కాలనీతో పాటు పలు ప్రాంతాలలోని అమ్మ వారి దేవాలయాలలో అత్యంత వైభవంగా ఆషాడ మాస బోనాల జాతర ఉత్సవాలు జరిగాయి.జిహెచ్ఎంసి కౌన్సిల్ బిజెపి విప్,కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి పలు శ్రీ మహంకాళీ దేవాలయాలను సందర్శించి అమ మ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.అమ్మ వారి జాతర తొట్టెల ఊరేగింపు ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమంలో పలువురు బిజెపి నాయకులు, బలరామ కృష్ణ భక్త భజన మండలి ప్రతినిధులు పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం డివిజన్ పరిధి హెచ్ఏఎల్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన స్వర్గీయ వంగవీటి మోహన రంగా కాంస్య విగ్రహ ఆవిష్కరణ సందర్భంగా ఆదివారం ఎమ్మెల్యే కెపి వివేకానంద్ ముఖ్య అతిథిగా పాల్గొని నివాళులు అర్పించారు. తోట చంద్రశేఖర్‌రావు, వంగవీటి రాధాకృష్ణ, కార్పొరేటర్ రావుల శేషగిరి పాల్గొన్నారు.

డాక్టర్ ముదుగంటికి ఘన సత్కారం

జాతీయ కవి సమ్మేళనంలో డాక్టర్ మునుగంటిని సన్మానిస్తున్న దృశ్యం

ధర్నాచౌక్, జూలై 9, ప్రభాతవార్త: ప్రముఖ కవి డాక్టర్ ముదుగంటిని శ్రీశ్రీ కళా వేదికలో ఆదివారం ఘనంగా సత్కరించారు. శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ అధ్యక్షులు, గుర్రం జాషువా పురస్కార గ్రహీత డాక్టర్ కత్తి బండ ప్రతాప్ ఆధ్వర్యంలో తెలంగాణ సారస్వత పరిషత్ హాలులో నిర్వహించి 121వ జాతీయ కవి సమ్మేళనంలో డాక్టర్ ముదుగంటిని శాలువాతో, పూలమాలతో సత్కరించి, జ్ఞాపికను అందచేశారు. సాహితీ క్షేత్రంలో అనేక కవి సమ్మేళనాలు చేసిన గొప్ప డాక్టర్ ముదుగంటి అని పలువురు కొనియాడారు.

అమ్మవారిని వేడుకుంటే కోరుకున్న కోర్కెలు నెరవేరుతాయి

బిఆర్ఎస్ నేత ఎన్.శ్రీగణేష్

రెజిమెంటల్ బజార్ గండి మైసమ్మ దేవాలయంలో పూజలు చేస్తున్న శ్రీగణేష్ తదితరులు

అడ్డగుట్ట, జూలై 9 ప్రభాతవార్త: అమ్మవారిని వేడుకుంటే కోరుకున్న కోర్కెలు నెరవేరుతాయని బిఆర్ఎస్ నేత ఎన్.శ్రీగణేష్ తెలిపారు. ఉజ్జయిని మహాకాలి బోనాల జాతర మహోత్సవాలను పురస్కరించుకొని మోండా డివిజన్ రెజిమెంటల్ బజార్‌లోని శ్రీ గండి మైసమ్మ దేవాలయంలో నిర్వహించిన బోనాల మహోత్సవ వేడుకల్లో ్ల ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు ఏ.బాబురావ్ ముదిరాజ్, అల్లాడి గౌరి శంకర్, నందికంటి రవి, నీలాంకర్, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు నర్సింహ్మ ముదిరాజ్, సృజన్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన అతిథులకు శాలువకప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

పాలిక బజార్‌లో అగ్ని ప్రమాదం

పరిస్థితిని పర్యవేక్షించిన మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

కంటోన్మెంట్, జూలై 9 ప్రభాతవార్త: సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలోని పాలిక బజార్‌లోని రెండు బట్టల షాపులు షాట్‌సర్క్యూట్‌తో దగ్ధమైన సంఘటన మార్కెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు,ప్రత్యేక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం 31 బస్టాప్ నుంచి పాత గాంధీ ఆసుపత్రికి వెళ్లే ప్రధాన రోడ్డు మార్గంలో ఉన్న అమోల్ సెలెక్షన్, అన్‌మోన్ కిట్స్ రెండు బట్టల షాపులు ఆదివారం తెల్లవారు జామున షాట్ సరూ ్క్యట్‌తో అగ్నిప్ర మా దానికి గురైంది. దీంతో దట్టమైన పొగలు, మంటలు ఎగసి పడడంతో మార్కెట్ పోలీసులు, సికింద్రాబాద్ అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని ఎగసి పడుతున్న మంటలను అదుపు చేశారు. విఇషయం తెలుసుకున్న రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, మోండా డివిజన్ కార్పోరేటర్ కొంతం దీపిక లు ఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని పర్యవేక్షించారు. అగ్నిప్రమాదంలో ఎలాం టి ప్రాణ నష్టం జరగడం లేదు. ఈ అగ్నిప్రమాదంలో ఫైర్ ఆఫీసర్ డి.మోహన్ రావ్, మార్కెట్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్ రావ్‌లు పాల్గొని మంటలను అదుపు చేశారు.

వెయ్యి కోట్లతో మహాకాళీ ఆలయ పరిసరాలు అభివృద్ధి చేయాలి

సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి

బేగంపేట జులై 9,ప్రభాతవార్త : సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ ఆషాడ బోనాల జాతర సందర్భంగా అమ్మ వారిని సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి ఆదివారం రాత్రి దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మ వారి ఆలయ పరిసరాలను ప్రభుత్వం వెయ్యి కోట్లతో అభివృద్ధి చేయాలని డిమాండ్ చేసారు.ఏడో తరమైన సురిటి రామేశ్వర్,కామేశ్వర్ లతో మాట్లాడటం జరిగిందని,వారు ఆలయానికి సంబంధించిన పలు విషయాలను తన దృష్టికి తీసుకు వచ్చినట్లు పేర్కొన్నారు.ఉజ్జయినీ మహాకాళీ దేవాలయం ఎంతో చరిత్ర కలిగిన దేవాలయమని,గతంలో కూడా ఆలయానికి వచ్చి అమ్మ వారిని దర్శించుకున్నానన్నారు.అమ్మ వారు ప్రజలందరినీ చల్లంగా చూడాలని కోరారు.

కనకదుర్గమ్మ దేవాలయంలో పూజలు

పురానాపూల్, జూలై 9 ప్రభాతవార్త : శాంతి స్వరూపిణిగా అదిపరాశక్తిగా పురానాపూల్ స్వామి వివేకనందనగర్ బస్తీలో కనకదుర్గమ్మగా వెలసిఎంతో ప్రసిద్ధి చెందింది. నాటినుంచి నేటి వరకు భక్తుల పాలిట కొంగుబంగారం కొర్కెలను తీర్చే కల్పవల్లిగా విరాజిల్లుతుందిఆషాడ మాసంబోనాల ఉత్సవాలను పురస్కరించుకుని స్వామివివేకనందనగర్ కనకదుర్గ దేవాలయంలో ఘటాల ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.శనివారం నుంచి ఆదివారం తెల్లవారు జాము వరకు భజన కార్యక్రమాలను నిర్వహించారు.అనంతరం అమ్మవారి ఘట్టానికి ప్రత్యేక పూజలు చేశారు.అమ్మవారి ఘట్టాని న్ బ్యాండ్ మేళాల మధ్య పార్దివాడ,శివనగర్,గల్బవీధి,గొల్లకిడికి,మురళీనగర్‌ల మీదుగా కనకదుర్గ దేవాలయానికి చేరుకుంది.అమ్మవారి ఘట్టానికి సాకాలు పోసి పూజలు చేశారు.ఈ కార్యక్రమంలో చైర్మన్ ఎం.కిషన్ తదితరులు పాల్గొన్నారు.

హోంమంత్రిని మహమ్ముద్ అలీని కలిసిన బిఆర్ఎస్ ఇన్‌చార్జ్ సిహెచ్.ఆనంద్ కుమార్‌గౌడ్

అఫ్జల్‌గంజ్,జూలై 9ప్రభాతవార్త: నాంపల్లి నియోజకవర్గం బిఆర్ఎస్ ఇన్‌చార్జ్ సిహెచ్. ఆనంద్ కుమార్‌గౌడ్ తెలంగాణ హోం శాఖ మంత్రి మహమ్ముద్‌అలీని కలిసి బోనాల ఉత్సవాలకు ఆహ్వానించారు.ఈనెల 16,17వ తేదిలల్లో జరిగే తెలంగాణ ఆషాడ మాసం బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని బజార్ ఘాట్‌లోని చారిత్రాత్మకమైన ఏడుగుళ్ల ఆమ్మవారి దేవాలయంలో జరిగే బోనాల ఉత్సవాలకు రావాలని కోరారు. ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోడీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రవిప్రసాద్ గౌడ్ తదితరులు

మోడీ చిత్రపటానికి క్షీరాభిషేకం

సికింద్రాబాద్, జూలై 9 ప్రభాతవార్తః ప్రధాని నరేంద్ర మోడీ భారత దేశాన్ని ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద ఆర్థికశక్తిగా చేశారని బీజేపీ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి. రవిప్రసాద్ గౌడ్ అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో వివిద అభివృద్ధి పనులకు ప్రధాని నరేంద్రమోడీ రూ. 6వేల 100 కోట్లతో శంకుస్థాపనలు చేసినందుకు ఆయన చిత్రపటానికి మాజీ కార్పొరేటర్ స్వరూపాగౌడ్ ఆధ్వర్యంలో వారాసిగూడ చౌరస్తా వద్ద క్షీరాభిషేకం జరిపారు. ఈ కార్యాక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని శంకుస్థాపన చేసిన అభివృద్ధి పనుల వల్ల వేలాది మందికి ఉపాధి అవకాశాలు కలుగుతాయని తెలిపారు. ముఖ్యంగా వరంగల్‌లో రైల్వేకోచ్ ఫ్యాక్టరీ వల్ల అనేక కుటుంబాలు బాగుపడతాయని చెప్పారు. ఈ కార్యాక్రమంలో నాగేశ్వర్‌రెడ్డి, రాజు, దత్తు, కుమార్, బైరి సురేష్, నాగేష్, సత్యనారాయణ, మల్లేశ్వర్‌రావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జెపి నడ్డాకు స్వాగతం పలికిన కేశబోయని శ్రీధర్

సైఫాబాద్, జులై 9 ప్రభాతవార్త: దక్షిణాది రాష్ట్రాల బిజెపి అధ్యక్షులు, సంఘటన ప్రధాన కార్యదర్శులు, ఇన్‌చార్జీల సమావేశానికి ముఖ్యఅతిథిగా బిజెపి జాతీయ అధ్యక్షుడు జె.పి.నడ్డా ఆదివారం హైదరాబాద్ నగరానికి విచ్చేశారు. ఆయనకు బేగంపేట విమానాశ్రయంలో హైదరాబాద్ జిల్లా ఓబిసి మోర్చా నగర ప్రధాన కార్యదర్శి కేశబోయిన శ్రీధర్ ఘనంగా స్వాగతం పలికారు.

ఏబీసీడీ వర్గీకరణ సాధిద్దాం

జెండా ఆవిష్కరిస్తున్న ఎంఆర్‌పీఎస్ నేతలు

ధర్నాచౌక్, జూలై 9,ప్రభాతవార్త: ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఏబీసీడీ వర్గీకరణ సాధిద్దామని ఎంఎస్‌పీ, ఎంఆర్‌పీఎస్ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావ వేడుకలలో భాగంగా ముషీరాబాద్ నియోజకవర్గం భోలక్‌పూర్‌లోని ఇంద్రానగర్‌లో ఎంఎస్‌పీ, ఎంఆర్‌పీఎస్ ముషీరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి గజ్జెల రాజశేఖర్ మాదిగ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ఎంఎస్‌పీ, ఎంఆర్‌పీఎస్ సీనియర్ నాయకులు గండి కృష్ణ మాదిగ హాజరై డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రామ్‌ల విగ్రహాలకు పూల మాలలు వేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బాబూ జగ్జీవన్ రామ్ సంఘం అధ్యక్షులు సంఘపాక భాస్కర్, బస్తీ నాయకులు నందగిరి నర్సింగరావు, చిలక ఎల్లయ్య మాదిగ, దశరథ్, ఇల్లెందు ఎల్లయ్య మాదిగ నంది జీవన్ మాదిగ, ఎం.శ్రీనివాస్‌మాదిగ, విజయ్ మాదిగ, మహాత్మానగర్ మాదిగ సంఘం అధ్యక్షులు గోకారపు జంగయ్య మాదిగ తదితరులు పాల్గొన్నారు.

విఖ్యాత గాయకుడు ఎస్పీ బాలసు



వజ్ర మైసమ్మ దేవాలయంలో జరిగిన బోనాల ఉత్సవాలల్లో పాల్గొన్న బిఆర్ఎస్ నాయకులు గడ్డం శ్రీనివాస్‌యాదవ్, ఉద్యమనేత ఆర్వీమహేందర్‌కుమార్‌లు

బోనాల్లో పాల్గొన్న నాయకులు

గన్‌ఫౌండ్రి,జులై9ప్రభాతవార్త: తెలంగాణ ఆషాడ మాసం బోనాల ఉత్సవాల్లో భాగంగా ఆదివారం కోఠి విశ్వ హిందు పరిషత్ కార్యాలయం వీధిలో ఉన్న వజ్ర మైసమ్మ దేవాలయంలో అమ్మవారి బోనాల పండుగను ఘనంగా నిర్వ హించారు.ఈపూజ కార్యక్రమంలో గడ్డం గంగాధర్ ఫౌండేషన్ చైర్మన్,బిఆర్ఎస్ నాయకులు గడ్డం శ్రీనివాస్‌యాదవ్,ఉద్యమ నేత ఆర్వీమహేందర్‌కుమార్,సతీష్ గౌడ్ పాల్గొన్ని పూజలు చేశారు.ఈకార్యక్రమంలో ఆర్.ఎ.వినోద్‌కమార్ పాల్గొన్నారు.

నాయకుల ప్రత్యేక పూజలు

అమ్మవారిపూజల్లో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ పి.మమతసంతోష్‌గుప్త

బేగంబజార్,జూలై 9ప్రభాతవార్త: ఆషాడ మాసం బోనాల ఉత్సవాల్లో భాగంగా ఉస్మాన్‌గంజ్, కోఠి తదితర ప్రాంతాలల్లో జరిగిన బోనాల పండుగల్లో వివిధ పార్టీలకు చెందిన ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్ని ప్రత్యేక పూజలు చేశారు.కార్పొరేటర్ జి.శంకర్‌యాదవ్,మాజీ కార్పొరేటర్ పి.మమతసంతోష్‌గుప్త,గణేష్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి డాక్టర్ భగవంత్‌రావు,బిఆర్ఎస్ నాయకులు ఎం.ఆనంద్‌కుమార్‌గౌడ్,గడ్డం ఆశీష్‌కుమార్‌యాదవ్,మల్లేష్, వినోద్‌కుమార్, శేఖర్, శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు. భక్తులకు అన్నదానం చేశారు.

కురుమ బస్తీలో సమస్యలపై ఆరా

భరతసింహారెడ్డికి సమస్యలు వివరిస్తున్న స్థానికులు

పేట్‌బషీరాబాద్, జూలై9 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల డివిజన్ పరిధిలోని కురుమ బస్తీలో బీజేపి మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరతసింహా రెడ్డి ఆదివారం పర్యటించి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు రోడ్లు, డ్రైనేజీ, పారిశుద్యం, మంచినీటి తదితర సమస్యలను భరతసింహా రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను త్వరితగతి న పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సత్త య్య, దుర్గయ్య, ప్రతాప్, మల్లేష్, చం ద్రయ్య, ఎస్.సత్త య్య, బాబు, శ్రీనివాస్ ముదిరాజ్, నందుగౌడ్, సందీప్‌గౌడ్, నవీన్, వంశీ,శివ, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు విద్యార్థి దశనుంచే కరాటే నేర్చుకోవాలి

సర్టిఫికేట్లు పొందిన విద్యార్థులతో సరేంద్ర కటగేరి, రాఘవేంద్ర దేశాయ్, దామోదర్ నాయక్ తదితరులు

హైదరాబాద్, జూలై 9, ప్రభాతవార్త: విద్యా ర్థులు విద్యార్థిదశనుంచే కరాటే నేర్చుకోవాలని, దీంతో శారీకంగా ,మాన సికంగా ఉంటారని కర్ణా టక సాహిత్యమందిర్ అధ్యక్షులు సురేంద్ర కటగేరి అన్నారు. జపాన్ కరాటే అసోసి యేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆదివారం బర్కత్‌పురా నృపతుంగ స్కూల్‌లో నిర్వహించిన ఆప్‌గ్రేడింగ్ ఎగ్జామ్ పోటీల్లో హెల్ప్‌లీగ్ కర్ణాటక సాహిత్యమందిర్ విద్యార్థులు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చారు. ఆప్‌గ్రేడింగ్ ,గ్రేడింగ్‌లో గెలుపొందిన విద్యార్థులకు కర్ణాటక సాహిత్యమందిర్ అధ్యక్షులు సురేంద్ర కటగేరి, ఉపాధ్యక్షులు రాఘవేంద్ర దేశాయ్, హెల్ప్‌లీగ్ ప్రధాన కార్యదర్శి శాంతి స్వరూప్ లీలె, కరాటే కోచ్ దామోదర్ నాయక్, కృష్ణ, ముకుంద్ కులకర్ణి, డిఎన్‌రావు, ప్రదీప్ దేశ్‌పాండేలు అభినం దించి సర్టిఫికేట్లు ప్రధానం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు కరాటే నేర్చుకోవడానికి ముందుకు రావాలని సూచించారు. విద్యార్థులు చదువుతో పాటు కరాటేనే అభ్యసించడం ఎంతో అవసరమని, ఆత్మరక్షణ కోసం విద్యార్థులు కరాటేను తప్పనిసరిగా నేర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దామోదర్ నాయక్, కరాటే ఇన్‌స్ట్రక్చర్ ఎ.కృష్ణ, రాపోలు సుదర్శన్, అదితి, వరప్రసాద్, వైష్ణవి, కార్తీక్, దర్శిల్, రితేశ్, ప్రజ్ఞ, హనిష్క, వంశిక తదితరులు పాల్గొన్నారు.

అమ్మ వారిని దర్శించుకుని పూజలు చేసిన కాంగ్రెస్ జాతీయ మీడియా అండ్ పబ్లిసిటీ విభాగం ఛైర్మన్ పవన్ ఖేరా

బేగంపేట జులై 9,ప్రభాత వార్త : సికింద్రాబాద్ శ్రీఉజ్జ యినీ మహాకాళీ అమ్మ వారి ఆషాడ బోనాల జాతర సందర్భంగా అఖిల భారత కాంగ్రెస్ కమిటీ జాతీయ మీడియా అండ్ పబ్లిసిటీ ఛైర్మన్, కాంగ్రెస్ జాతీయ అధికార ప్రతినిధి పవన్‌ఖేరా తెలంగాణా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోట నీలిమాతో కల్సి ఆదివారం సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా కోట నీలిమ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా వారు అమ్మ వారికి బంగారు బొట్టు,ముక్కుపుడకను అందజేసారు.అనంతరం ఆలయ అర్చకులు వారికి వేద ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేసారు.ఈసందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ అమ్మ వారి అనుగ్రహం ఎల్లప్పుడు ప్రజలపై ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనుపశేఖర్,యువజన కాంగ్రెస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు మోత రోహిత్ నేతలు భరత్,సుధీర్ కుమార్ తదితరులు ఉన్నారు.

మెరుగైన సేవలతో ప్రజాదారణ

యూసుఫ్‌గూడ, జూలై 9, ప్రభాతవార్త : ఏ కంపెనీ అయినా నాణ్యమైన ఉత్పత్తులు, మెరుగైన సేవలతో ప్రజాదరణ చూరగొంటుందని జూబ్లిహిల్స్ ఎమ్మెల్యే భారత రాష్ట్ర సమితి పార్టీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు మాగంటిగోపినాథ్ పేర్కొన్నారు. శ్రీనగర్ కాలనీలో కాయిన్ ఆర్ట్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ కార్పోరేట్ కార్యాలయాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజంలో ఏ కంపెనీ అయినా నాణ్యమైన ఉత్పత్తులతోపాటు మెరుగైనా సేవలను అందించినపుడే ప్రజల యొక్క ఆదరణ చూరగొంటుందని తెలిపారు. ముఖ్యంగా కాయిన్ ఆర్ట్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ వివిధ రంగాల్లో మెరుగైనా సేవలను అందిస్తూ అభివృద్ధి చెందుతుండటం హర్షనీయమన్నారు. ఈవిషయంలో సంస్థ ఈసీఓ సునీల్ సింగ్, డైరెక్టర్లు వెంకట సుబ్బయ్య, యోగానందం తదితరుల కృషిని ఆయన అభినందించారు. అనంతరం సంస్థ వ్యవస్థాపక చైర్మన్ సింగవరం సునీల్ కుమార్ సింగ్ మాట్లాడుతూ కాయిన్ ఆర్ట్ కంపెనీ ఇన్‌ఫ్రా, క్రియేషన్స్, టెక్నాలజీ, హెల్త్‌కేర్ రంగాలలో ఇప్పటికే మెరుగైన సేవలందిస్తూ ప్రజల ఆదరాభిమానులను చూరగొంటోందని తెలిపారు. హెల్త్‌కేర్ రంగంలో చాలా వరకు ఔషదాలను ఉచితంగా సరఫరా చేసే ప్రజల మన్ననలను పొందుతున్నట్లు వివరించారు. ఇప్పటికే తమ స్వగ్రామమైన కడప జిల్లా మైదుకూరులో ఆర్వోపాన్లంట్ ఐఎస్ఐ మార్కుతో విజయవంతంగా నడిపిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో టిటిడీ మాజీ చైర్మన్, మైదుకూరు టీడిపి ఇంచార్జి పుట్టా సుధాకర్, సంస్థ డైరెక్టర్లు పి.వెంకటసుబ్బయ్య, బి.యోగానందం, ఆక్సిలైఫ్ డైరెక్టర్ ఎస్.సురేష్‌కుమార్ సింగ్, బిల్డింగ్ డిజైనర్లు(నెస్టా ఆర్కిటెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు) తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ కారుల ఆకాంక్షలను రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లుతా

సీనియర్ కాంగ్రెస్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి

మాట్లాడుతున్న రాగిడి లక్ష్మారెడ్డి, వేదికపై నల్లరాధా కృష్ణ

నాచారం, జులై 9 ప్రభాతవార్త: ఉద్యమ కారుల ఆకాంక్షలను రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పార్టీ మ్యానిఫె స్టోలో పెట్టేందుకు కృషి చేస్తానని ఉప్పల్ నియో జక వర్గం సీనియర్ కాంగ్రెస్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి పేర్కొ న్నారు. నాచారంలోని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ కార్యాలయంలో కర్నాటకలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం.. తెలంగాణపై దాని ప్రభావం అనే అంశంపై నియోజక వర్గ స్థాయి సదస్సు నిర్వహించారు. ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ నల్లా రాధా కృష్ణ అధ్యక్యతన జరిగిన ఈ సమావేశానికి అయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ అన్ని డివిజన్లలో ఉన్న సమస్యలపై జేఏసీ నాయకులతో కలిసి ఉద్యమిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మేడల మల్లికార్జున్ గౌడ్, జేఏసీ కన్వీనర్ బుదాని సదానందం, కో ఆర్డీనేటర్ కనుకుంట విజయ్‌కుమార్, గుర్రాల మల్లేష్, బైరపాక సురేందర్, చింతకింది సాయిరామ్, ఎ.నరేష్, హరిబాబు, నర్సింగరావు, సతీష్, లింగస్వామి, సంజీవ, హెహన్, పాషతో పాటు పలువురు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

చిక్కడపల్లి, జూలై 9 ప్రభాతవార్త: బోనాలు ఉత్సవాలను పురస్క రించుకుని సికింద్రా బాద్ ఉజ్జయినీ మహాంకాళి అమ్మవారి ఆలయాన్ని ఆదివారం ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి మొక్కులు చెల్లించు కున్నారు. ఎమ్మెల్యే వెంట బిఆర్ఎస్ యువనేత ముఠాజైసింహా, గాంధీనగర్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు ఎం.రాకేశ్‌కుమార్, నేతలు వల్లాల శ్రీనివాస్‌యాదవ్, ఆనంద్, నితిన్ తదితరులున్నారు. ఈ సందర్భంగా ఆలయ మర్యాదలతో వేదపండితులు ఎమ్మెల్యేకు ప్రత్యేక అర్చనలు నిర్వహించిన అనంతరం తీర్థప్రసాదాలను అందించి వేద ఆశీర్వచనం చేశారు.

తెలంగాణ ఉద్యమంలో సాయిచంద్ పాట ఉద్యమానికి ఊపిరిపోసింది.. ప్రముఖ గాయ కుడు, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ సాయిచంద్ సంతాపసభలో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ పాల్గొని ఘనంగా నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే వెంట తెలంగాణ రాష్ట్ర వైద్యసేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ చైర్మన్ ఎర్రొళ్ళ శ్రీనివాస్, బిఆర్ఎస్ యువనేత ముఠాజైసింహా, గాంధీనగర్ బిఆర్ఎస్ అధ్యక్షుడు ఎం.రాకేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాయిచంద్ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే ఓదార్చారు. తెలంగాణ ఉద్యమ సమయంలో సాయిచంద్ తన పాట ద్వారా ప్రజల్లో ఎంతో చైతన్యాన్ని తీసుకువచ్చారని, ఆయన లేనిలోటు తెలంగాణ సమాజానికి తీరనిదని అన్నారు.

వైభవోపేతంగా వరాల పోచమ్మ అమ్మవారి కల్యాణోత్సవం

చిక్కడపల్లి, జూలై 9 ప్రభాతవార్త: గాంధీనగర్ డివిజన్‌లోని జవహర్‌నగర్ ఆర్టీసిక్రాస్ రోడ్స్‌లోని వరాల పోచమ్మ అమ్మవారి కల్యాణోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించ బోతున్నట్లు ఆలయం డైరెక్టర్ సిహెచ్.నిరంజన్, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.కనకరాజ్, యేసురత్నం, కోశాధికారి బి.శ్రీరాములు వివరించారు. ఆదివారం ఆలయం ప్రాంగణంలో విలేకరులతో మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు. 11న ఉదయం గణపతి పూజ, నవగ్రహ పూజ, అమ్మవారికి దుర్గహోమం, మధ్యాహ్నం రెండు గంటలకు కుంకుమార్చన ఉంటుందని వివరించారు. 12, ఉదయం అమ్మవారి కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహిస్తామని, భక్తులు పెద్దసంఖ్యలో హాజరు అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు. కాగా 16న బోనాల పండుగ సందర్భంగా ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు, పంచామృతాభిషేకాలు, అన్నదాన కార్యక్రమం ఉంటుందని వివరించారు. ఈ సమావేశంలో ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు కె.సాయిరా్, కార్యదర్శులు ఎ.గణేష్, ఎం.కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

మంత్రముగ్ధులను చేసిన మయూరి నృత్యోత్సవం

నాట్యభారతి, నాట్యజ్యోతి పురస్కారగ్రహీతలతో ఎస్వీ.భారతి, వేదాంతం రాధేశ్యామ్, రామ్‌దాస్, రాగిణి తదితర అతిథులు

రవీంద్రభారతి, జూలై 9 ప్రభాతవార్త : ప్రముఖ సాంస్కృతిక సేవాసంస్థ శ్రీ మయూరి నృత్యాలయ ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో గురువందన నృత్యోత్సవం, ప్రముఖ నాట్యగురువులకు నాట్యభారతి, నృత్యప్ర దర్శనలు కావించిన వారి శిష్యులకు నాట్యజ్యో తి పురస్కారాల ప్రదానోత్స వం వైభవోపేతంగా జరిగి ఈ సందర్భంగా చిన్నారి నృత్యకళాకారిణులు ప్రదర్శించిన పలు నృత్యాంశాలతో నాట్యప్రదర్శనలు ఆహుతులను ఎంతగానో అలరించి మంత్రముగ్ధులను చేశాయి. నాట్యశ్రీ ఉదయశ్రీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన కేంద్ర సంగీత నాటక అకాడమీ సభ్యురాలు డా. ఎస్.పి.భారతి, కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కార గ్రహీత డా. వేదాంతం రాధేశ్యామ్‌లు నాట్యం మోక్ష సాధనమని, అంతేకాక మానసిక ఉల్లాసాన్ని, వికాసాన్ని, శారీరక మానసిక ఉత్తేజాన్ని, చైతన్యాన్ని కలిగిస్తాయనంటూ విశిష్ట అతిథులు హైదరాబాద్ అదనపు డిజిపి రామ్‌దాస్ తేజావత్, ప్రముఖ నటి రాగిణి, నిర్వాహకులు రామ్‌కుమార్, నందితలక్ష్మి, శ్రీదేవి తదితరులతో కలిసి ప్రఖ్యాత నాట్యగురువులు సాయిమాధవి, విమల, సత్యనారాయణ, ఉదయశ్రీ, లలిత ధనలక్ష్మి, దీపిక, మధుబాబు, డా. ఎస్.పి.కృష్ణకుమారి, భానుప్రమీల, స్వప్న ప్రవీణ్, భవాని, మాధురి, ప్రశాంతి, అంజలిరెడ్డి, సాయిశిల్ప, మేఘన, శివాని, తేజశ్రీ, ప్రశాంత్, శృతి, స్వప్నలత, సవిత తదితరులను ఘనంగా సత్కరించి నాట్య భారతి పురస్కారాలను, కళాకారిణులకు నాట్యజ్యోతి పురస్కారాలను ప్రదానం చేసి ఎంతగానో అభినందించారు.

ఎయిమ్ ఫర్ సేవా అనాథ కేంద్రంలో ఉచిత వైద్య శిబిరం

అల్వాల్, జూలై 9 ప్రభాతవార్త: ఎయిమ్ ఫర్ సేవ కేంద్రంలో ఓజోన్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఆదివారం జరిగింది. ఆసుపత్రి జనరిక్ మెడికల్ స్టోర్ సోలిస్ కంటి ఆసుపత్రిలు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసాయి. చిన్నారులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. ఓజోన్ ఆసుపత్రి చైర్మన్ సత్యసాయి ప్రసాద్, మేనేజింగ్ డైరెక్టర్ దీప్తి, గడ్డం రఘునాథ్ రెడ్డి, సౌజన్య శిబిరంలో పాలు పంచుకున్నారు.

మంచినీటి,డ్రైనేజీ పైపుల మరమ్మత్తు పనులను త్వరలోనే ప్రారంభిస్తాం

చిక్కడపల్లి, జూలై 9 ప్రభాతవార్త: రామ్‌నగర్ డివిజన్‌లోని నల్లకుంట కూరగాయల మార్కెట్ వద్ద మంచినీటి,డ్రైనేజీ పైపుల మరమ్మత్తు పనులను త్వరలోనే ప్రారంభిస్తామని హైదరాబాద్ మెట్రోవాటర్‌వర్క్స్ చిలకలగూడ డివిజన్ డీజీఎం మోహన్‌రాజు తెలిపారు. నల్లకుంట సిటిజన్స్ అసోసియేషన్, ఆదర్శనగర్ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో డీజీఎంను కలిసి మంచినీటి, డ్రైనేజీ పైపులకు మరమ్మత్తులు చేపట్టాలని కోరుతూ వినతిపత్రాన్ని సమర్పించారు. డీజీఎంను కలిసిన వారిలో నల్లకుంట సిటిజన్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డి.మోహన్‌నాయుడు, నిర్వహణ కార్యదర్శి వీరయ్య, ఆదర్శనగర్ కాలనీ అసోసియేషన్ నిర్వహణ కార్యదర్శి బి.వెంకటస్వామిగౌడ్, ఎంసిఏ నాయకులు శ్రీనివాస్‌రావు, రమణ, సుశాంత్ తదితరులున్నారు. ఈ ప్రాంతంలో నాలా పనులలో పైపులు పగిలి నీరు లీకేజీ అవుతున్నాయని, మూడు నెలలు గడుస్తున్నా పనులు జరగడం లేదని ఫిర్యాదు చేశారు. నాలా, బ్రిడ్జ్ పనులు ప్రారంభించి 15 నెలలు అవుతున్నాయని, అంబర్‌పేట, ముషీరాబాద్ ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, ముఠాగోపాల్ పరిశీలించిన విషయాన్ని గుర్తు చేశారు.

అమ్మవారి బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి

తార్నాక, జులై 9 ప్రభాతవార్త: ఆషాడ మాసం లష్కర్ బోనాల వేడుకల్లో భాగంగా సికింద్రాబాద్ టకారా బస్తీ ఘస్ మండిలోని శ్రీ ముత్యాలమ్మ అమ్మవారిని నగర డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మోతె శోభన్‌రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి దీవెనలతో అందరు సుఖసంతోషాలతో ఉండాలని వారు ఆకాంక్షిం చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అనితానాయక్ తధితరులు పాల్గొన్నారు.

భక్తులతో కలిసి అన్నదానంలో పాల్గొన్న ఆయల కమిటీ సభ్యులు

సంజీవరెడ్డి నగర్, జులై 9, ప్రభాతవార్త : బల్కంపేట శ్రీ ఎల్లమ్మ పోచమ్మ దేవస్థానంలో ప్రతిరోజు జరిగే అన్నదాన కార్యక్రమానికి ఆదివారం ఆలయ కమిటీ సభ్యులు భక్తుల తో కలిసి అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భోజనాలు చేశారు. అన్నదానంలో వడ్డించే పదార్థాల నాణ్యత ను పరిశీలించి సభ్యులు సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దేవాస్థనం పాలకమండలి సభ్యులు ప్రభుగౌడ్, ముచ్చర్ల ఆంజనేయులుయాదవ్, సరాఫ్ సంతోష్, పుష్పలత, గౌతమ్ రెడ్డి, అనిల్, కూతురు నరసింహా, ఉప్పల యాదగిరి, దేవస్థాన సూపర్డెంట్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

రోగులకు ఉచిత వైద్యసేవలందిస్తున్న డాక్టర్లు

నాచారం, జులై 9 ప్రభాతవార్త: మాల్లాపూర్ అంబెద్కర్ కమ్యూనిటీహాల్లో నాచారంలోని శ్రీపూజా మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిభిరానికి విశేషస్పంద వచ్చింది. వందలాదిమంది రోగులు శిభిరంలో సేవలందుకున్నారు. ఈ కార్యక్రమానికి స్థానిక కార్పోరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి హాజరయ్యారు. సామాజిక సేవలోభాగంగా ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్యశిభిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని డాక్టర్లు పేర్కొన్నారు. డెంటల్, సాధారణ సేవలు, కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు పి.చంద్రశేఖర్, బి. నాగార్జున,భవ్య, కె.వరిజ, హాస్పిటల్ మేనేజర్ విజయ్, అంబేద్కర్ యూత్ అసోషియేషన్ అధ్యక్షులు పర్నాటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయస్థానాల్లో తెలుగులో తీర్పు సాంప్రదాయంలా మారాలి

జస్టిన్ నవీన్‌రావును సన్మానిస్తున్న బుద్ధప్రసాద్, జస్టిన్ బి.సుదర్శన్‌రెడ్డి,హారగోపాల్ తదితరులు

హైదరాబాద్,జూలై 9,ప్రభాతవార్త: న్యాయస్థానాల్లో తెలుగులో తీర్పు ఇవ్వడం ఒక సాంప్రదాయంలా మారాలని వక్తలు అన్నారు. జస్టిస్ నవీన్‌రావు తొలిసారిగా తెలుగులో తీర్పును ప్రవేశపెట్టడాన్ని హర్షిస్తూ విశ్వనాథ సాహిత్య పీఠం ఆధ్వర్యంలో ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జస్టిస్ పి.నవీన్‌రావు అభినందన సభ ఏర్పాటు చేశారు.దీనికి ముఖ్యఅతిథులుగా జస్టిస్ బి.సుద ర్శన్‌రెడ్డి, సీనియర్ పాత్రికేయులు రామచంద్రమూర్తి, కె.శ్రీనివాస్, ఏపీ మాజీ డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్, ప్రొఫెసర్ హరగోపాల్‌లు హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కోర్టుల్లో సాధార ణంగా ఆంగ్లంలో తీర్పులు ఇస్తారని ,డ్రాఫ్ట్‌కూడా ఇంగ్లీష్ లోనే ఉంటుందన్నారు.

కన్నుల పండువగా మాతేశ్వరీ ఘట స్థాపన ఊరేగింపు

స్వాగతపై నుండి అమ్మవారి ఘటాలకు స్వాగతం పలుకుతున్న టిపిసిసి వర్కింగ్ ప్రసిడెంట్ అంజన్ కుమార్ యాదవ్, కార్పొరేటర్ ఆలె భాగ్యలక్ష్మి

చాంద్రాయణగుట్ట, జూలై 9 ప్రభాతవార్త : తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను అద్దంపట్టే పాతనగరంలో బోనాల జాతర ఉత్సవాలలో మాతేశ్వరీ ఘట స్థాపన ఊరేగింపు ఆదివారం సాయంత్రం అత్యంత వైభవంగా కన్నుల పండువగా జరిగింది. శాలిబండా కాశీ విశ్వనాథ స్వామి ఆలయంలో అమ్మవారి ఘటాలను ప్రత్యేకంగా అలంకరించి ఆయా దేవాలయాల వద్ద ప్రతిష్టించడంతో బోనాల ఉత్సవాలు ఊపందుకున్నాయి. డప్పు దరువులు, సన్నాయి వాయిధ్యాలు, వివిధ వేషాధరణలు, తెలంగాణ కళాకారులు, పోతరాజుల నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమూల మధ్య ఘటాల స్వాగతం ఊరేగింపు అంగరంగ వైభవంగా కొనసాగింది. లాల్‌దర్వాజ శ్రీ సింహవాహిణి మహంకాళి అమ్మవారు. ఉప్పుగూడ శ్రీ మహంకాళి అమ్మవారు, గౌలిపురా శ్రీ మాతేశ్వరీ భరతమాత, శ్రీ కోట మైసమ్మ దేవాయలం, మీరాలంమండి శ్రీ మహంకాళి ఆలయం, సుల్తాన్‌షాహి శ్రీ జగదాంబ దేవాలయం, నల్ల పోచమ్మ దేవాలయం, బేలా బంగారు మైసమ్మ, అక్కన్న మాదన్న ఆలయం, గౌలిపురా శ్రీ బంగారఉ మైసమ్మ ఆలయం, రాంబక్షీబండ శ్రీ బంగారు మైసమ్మ, గజానన్ వ్యాయామశాల అమ్మవారి దేవాలయం, గౌలిపురా మార్కెట్ రాంసింగ్‌బాడ బంగారు మైసమ్మ దేవాయాలకు చెందిన ఘటాలు ఉత్సవాలలో పాల్గొన్నాయి. లాల్‌దర్వాజ మోడ్ వద్ద భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వాగత వేదికపై నుండి తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రసిడెంట్, మాజీ ఎంపి అంజన్ కుమార్ యాదవ్, కార్పొరేటర్ ఆలె భాగ్యలక్ష్మి, ఊరేగింపు కమిటీ అధ్యక్షులు ఆలె భాస్కర్‌రాజ్, మాజీ అధ్యక్షులు గాజుల అంజయ్య, ఎస్.పి.క్రాంతి కుమార్ తదితరులు అమ్మవారి ఘటాలకు స్వాగతం పలుకుతూ పూజలు చేశారు. దారి పొడవునా ఏర్పాటు చేసిన స్వాగత వేదికలపై నుంచి అమ్మవారి ఘటాలకు పాతబస్తీ ప్రజలు, ఆలయాల కమిటీ ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు స్వాగత వేదికలు ఏర్పాటు చేసి ఘటాలకకు స్వాగతం పలికారు. భక్తుల కోలాహలం నడుమ ఘటాల ఊరేగింపు కన్నులపండువగా ముందుకు సాగింది. ఘటాలకు స్వాగతం పలికిన అనంతరం ఆయా దేవాలయాలకు అమ్మవారి ఘటాలను తీసుకువెళ్ళి ప్రతిష్టించారు. ఈ కార్యక్రమంలో వివిధ దేవాలయాల ప్రతినిధులు మల్లేషం గౌడ్, ఆలె జితేంద్ర, రాజేందర్ యాదవ్, కె.వెంకటేష్, పొన్న వెంకటరమణ, రాకేష్ తివారి, గాజుల అంజయ్య, మధుసూదన్ గౌడ్, ఎర్మని కైలాష్ వీర్‌లు పాల్గొని అమ్మవారి ఘటాలకు స్వాగతం పలికారు.

నల్ల పోచమ్మకు తొలి బోనం సమర్పణ

ఆషాడమాస బోనాల జాతర ఉత్సవాలు పురష్కరించుకొని జంగమ్మెట్ శ్రీ నల్ల పోచమ్మ దేవాలయంలో ఆదివారం ఆలయం నిర్వహకులు, టిపిసిసి కార్యనిర్వహక కార్యదర్శి పర్వతాల రాజేందర్ అమ్మవారికి తొలి బోనం, పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అన్న ప్రసాదం కార్యక్రమంలో పాల్గొని భోజనం స్వీకరించారు. పర్వతాల రాజేందర్ ఆడపరుచులకు చీర, గాజులు, చిన్నారులకు డ్రెస్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బిఎస్ఎన్ఎల్‌లో 4జీ, 5జీ సేవలను అందుబాటులోకి తీసుకురావాలి

బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ జాతీయ ప్రధాన కార్యదర్శి పి.అభిమన్యు

ఎల్‌బినగర్ నియోజకవర్గం అభివృద్ధిలో ముందంజ : ఎమ్మెల్యే

ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తదితరులు

మన్సూరాబాద్, జూలై 9 ప్రభాతవార్త : మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని వివిధ కాలనీ సంక్షేమ సంఘ సబ్యుల ఆత్మీయ సమావేశంలో ముఖ్యఅతిథిగా ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ఎల్.బి.నగర్ నియోజకవర్గన్నీ ఇంకా ఎంతో అభివృద్ధి చేయాల్సి ఉందని, దాదాపు అన్ని కాలనీల రోడ్ల నిర్మాణ పనులు పూర్తి చేయడం జరిగిందన్నారు. అలాగే లోవోల్టేజ్ సమస్యలు ఎక్కడెక్కడ ఉన్నాయో గుర్తించి నూతన ట్రాన్స్‌ఫార్మర్స్ ఏర్పాటు చేయిస్తామన్నారు. నూతన విద్యుత్ స్థంభాలు అవసరాన్ని గుర్తించి ఏర్పాటు చేస్తామన్నారు. దెబ్బతిన్న బి.టీ. సీ.సీ.రోడ్ల స్థానంలో నూతన రోడ్లు నిర్మించడం జరుగుతుందన్నారు. అలాగే నూతన డ్రైన్స్ నిర్మాణ పనులు, ఓపెన్ స్థలం ఉన్న కాలనీల యందు కమ్యూనిటి హాల్స్ నిర్మాణం, ఓపెన్ జిమ్స్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. వర్షపునీటితో కొన్ని కాలనీలు మునగడం జరుగుతుందని దీనికోసం బాక్స్ డ్రైన్స్ పనులు చేపట్టామన్నారు. పెద్ద చెరువును అత్యంత సుందరంగా తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. రిజిస్ట్రేషన్ సమస్యలు ఎదుర్కొంటున్న వారికి 118 జీ.ఓ.తెచ్చి వారికి ఉపశమనం కలిగించడం జరిగింది అని గుర్తు చేశారు. ఎల్.బి.నగర్ చంద్రపురికాలనీ ప్రధాన రహదారివద్ద రాత్రిపూట తీవ్ర ఇబ్బందులు గురిఅవుతున్న నేపథ్యంలో చుట్టుపక్కల కాలనీ వాసులకు రాబోయే రోజుల్లో ట్రాఫిక్ సమస్యల నుంచి పరిష్కారం చూపడం జరుగుతుందని తెలిపారు. అలాగే సర్వీస్ రోడ్డు వెడల్పు గురించి అధికారులచే చర్చించి తగు పరిష్కారం చూపెట్టడంజరుగుతుందని హామీనిచ్చారు. ఎల్.బి.నగర్ కూడలిని ఫ్రీ సిగ్నల్ వ్యవస్థగా చేయడం జరిగిందని తెలిపారు. వందల కోట్ల రూపాయలు నిధులు తెచ్చి ఇట్టి నియోజకవర్గన్నీ అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడం జరిగిందని గుర్తు చేశారు. ఎల్.బి.నగర్ నుంచి హయత్ నగర్ వరకు మెట్రో నిర్మాణం కూడా చేస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ ఇచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మన్సూరాబాద్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు జక్కిడి మల్లారెడ్డి, కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయం మాజీఛైర్మన్ ఈశ్వరమ్మయాదవ్, సీనియర్ నాయకులు కుంట్లూరు వెంకటేష్‌గౌడ్, మాజీ డివిజన్ అధ్యక్షులు టంగుటూరి నాగరాజు, జగదీష్ యాదవ్, యువనాయకులు జక్కిడి రఘువీర్‌రెడ్డి, రుద్ర యాదగిరినేత, బాల రాజుగౌడ్, రాజశేఖర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, విజయ్‌భాస్కర్ రెడ్డి, జగదీష్ గౌడ్, వివిధ కాలనీ అధ్యక్ష, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన రహదారిపై ఉన్న సమాధులను అక్రమంగా తొలగింపుపై బిజెపి ఆగ్రహం

చిల్కానగర్ లోతొలగించిన సమాధులను పరిశీలిస్తున్న బిజెపి నేతలు

ఉప్పల్, జూలై 9 ప్రభాతవార్త : చిల్కానగర్ ప్రధాన రహదారిలో సమాధులను అక్రమంగా తొలగించడంపై బీజేపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం పలువురు బిజెపి నేతలు సమాధుల స్థలాన్ని పరిశీలించారు. ఉప్పల్ బిజెపి అసెంబ్లీ కన్వీనర్ దేవసాని బాలచందర్, బిజెపి డివిజన్ అధ్యక్షుడు గోనె శ్రీకాంత్ కార్యదర్శి సంఘీ సామి యాదవ్ తదితరులు సమాధుల స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిల్కా నగర్ ప్రధాన రహదారిని ఆనుకొని అంబేద్కర్ విగ్రహం పక్కన ఉన్న చిలుకనగర్ పురాతన స్మశాన వాటిక ప్రహరీ గోడను పగులగొట్టి కొన్ని సమాధులను అధికారులు తొలగించడం శోచనీయమని అన్నారు. సమాధులకు సంబంధించిన ప్రజలు తీవ్రమైన మనోవేదనకు గురి అవుతున్నారు. వారి మనోభావాలను దెబ్బతినేలా అధికారులు వ్యవహరించడం సరైనది కాదని పేర్కొన్నారు. కూల్చివేతలను వెంటనే నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. భారతీయ జనతా పార్టీ పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని అధికారులను హెచ్చరించారు.

ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కరిస్తాం : మంత్రి సబితా ఇంద్రారెడ్డి



మంత్రి సబితా ఇంద్రారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ఎల్.బి.నగర్, జూలై 9 ప్రభాతవార్త : రాష్ట్రంలో గ్రాంట్-ఇన్-ఎయిడ్ వేతనాలతో పని చేస్తున్న డిగ్రీ కళాశాలల టీచింగ్, నాన్ టీచింగ్ రి డిప్లాయిడ్ సిబ్బంది ఆదివారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని కలిసి తమను ప్రబుత్వంలోని 010 పద్దులకింద జీతాలు ఇవ్వవలసిందిగా కోరుతూ వినతి పత్రాన్ని అందజేసి సిఎం కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించాలని మంత్రిని కోరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ సమస్య ప్రబుత్వం దృష్టిలో ఉందని తెలిపారు. గ్రాంట్-ఇన్-ఎయిడ్ తో పనిచేస్తున్న డిగ్రీ కళాశాలల సిబ్బందిని ప్రబుత్వంలో కలపాలనే విషయం చాలాకాలం నుండి పెండింగ్‌లో ఉందని, సమస్య త్వరలో పరిష్కారమయ్యే విధంగా ప్రబుత్వం చర్యలు చేపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రిడిప్లాయిడ్ జెఎసి జనరల్ సెక్రెటరీ జివి.క్రిష్ణారావు, డాక్టర్ కూరెల్ల అహల్య, వైస్ చైర్మన్ జె.ప్రభాకర్, లక్ష్మయ్య, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ రాజ్యాభిలేఖ పరిశోధనాలయంలో ఘనంగా బోనాల ఉత్సవాలు

తార్నాక, జూలై 9 ప్రభాతవార్త : తార్నాకలోని తెలంగాణ రాజ్యాభిలేఖ పరిశోధనాలయంలో నిత్యం విధి నిర్వాహణలో బిజిగా ఉండే ప్రభుత్వ ఉద్యోగులు ఆదివారం ఘనంగా బోనాల ఉత్సవాలు జరుపుకున్నారు. చిన్నాపెద్ద తేడా లేకుండా కనకదుర్గఅమ్మవారికి బోనం సమర్పించి వేడులను ఘనంగా జరుపుకున్నారు. 1969లో ప్రారంభమైన ఆర్కూస్ అప్పటినుంచి అమ్మవారికి బోనాలను సమర్పిస్తూ భక్తిని చాటుకుంటున్నారు. అనంతరం బోనం సమర్పించి ఆడిపాడారు. బోనం సమర్పించడం తమకు ఎంతో ఆనందాన్ని కల్గిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పరిపాలనాధికరి గంగాపురం శ్రీకాంత్, అసిస్టెంట్ ఆర్కివిస్ట్ గన్నెర్ల శ్రీకాంత్, ఉద్యోగులు బలరాం, రాజుదాసు, రామకృష్ణ, నాగరాజు, చంద్రశేఖర్, అజయ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మలక్‌పేట మహబూబ్ మాన్షన్ మార్కెట్‌లో ఘనంగా అమ్మవారి బోనాల ఉత్సవాలు

పూజలు నిర్వహిస్తున్న వినోద్‌కుమార్, ఉమాశంకర్, శేఖర్ తదితరులు

మలక్‌పేట, జూలై 9 ప్రభాతవార్త : మలక్‌పేట మహబూబ్‌మాన్షన్ మార్కెట్ లోని నవ దుర్గా మాత ఆలయంలో అఖిల హైదరాబాద్ హమాలీ సంఘం ఛైర్మన్ చేగూరి వెంకటరమణ, వైస్ ఛైర్మన్ సత్యలింగం, అధ్యక్షుడు ఉమాశంకర్, ప్రధాన కార్యదర్శి దానం శేఖర్ ఆధ్వర్యంలో బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మార్కెట్‌కు చెందిన వ్యాపారవేత్తలు, హమాలీలు, సిబ్బంది పెద్ద ఎత్తున ఆలయానికి విచ్చేసి అమ్మవారికి బోనాలు సమర్పించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం దేవాలయంలో బోనాల ఉత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సురేష్, కతలయ్య, లక్ష్మణ్, రాజు, కుమార్, సనప్ప, డి.రాజు, కుమార్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా తెలంగాణ మిర్చి అసోసియేషన్ అధ్యక్షుడు, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వంజరి వినోద్‌కుమార్ బోనాల పండుగ సందర్భంగా నవ దుర్గ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మంత్రి సబితాఇంద్రారెడ్డి చొరవతోనే కాలనీల అభివృద్ధి : సిరూర్ బాలరాజ్

సరూర్‌నగర్, జూలై 9 ప్రభాతవార్త: మంత్రి సబితా ఇంద్రారెడ్డి చొరవతోనే మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని కాలనీలు అభివృద్ధి చెందుతున్నాయని కార్పొరేషన్ మూడవ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ ఇంఛార్జి, కార్పొరేషన్ పార్టీ సీనియర్ నాయకుడు సిరూర్ బాలరాజ్ స్పష్టం చేశారు. డివిజన్‌లోని న్యూ గాయత్రీనగర్ నుండి రాఘవేందర్‌నగర్ వరకు మంత్రి కృషితో నూతనంగా ఏర్పాటవుతున్న రోడ్డు నిర్మాణపు పనులను ఆయన కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, సీనియర్ నాయకుడు దీప్‌లాల్ చౌహాన్ తదితరులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా బాలరాజ్ మాట్లాడుతూ ప్రజలకు మౌళిక సదుపాయాలను కల్పిస్తూ కాలనీలను అభివృద్ధి చేస్తున్న మంత్రి సబితారెడ్డికి కాలనీవాసుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్దాల అంజయ్య, కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

పార్టీకి పని చేసే వారికి గుర్తింపు, రాజకీయ భవిష్యత్తు ఉంటాయి: చల్లా నర్సింహారెడ్డి

పార్టీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న డిసిసి అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి

సరూర్‌నగర్, జూలై 9 ప్రభాతవార్త: కాంగ్రెస్‌లో ఉంటూ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి క్రమశిక్షణతో పని చేసే వారికి గుర్తింపు దక్కి చక్కని రాజకీయ భవిష్యత్తు ఉంటుందని రంగారెడ్డి డిసిసి అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి వెల్లడించారు. మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడ దీన్‌దయాళ్‌నగర్ కాలనీలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ జెండావిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన నర్సింహారెడ్డి, టిపిసిసి ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, నియోజకవర్గ నాయకుడు కొత్త మనోహర్‌రెడ్డి తదితరులతో కలిసి పార్టీ జెండానుఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎఐసిసి అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన భారత్ జోడో యాత్ర మంచి ఫలితాలను ఇచ్చిందని తెలిపారు. రాష్ట్రంలో రాహుల్, ప్రియాంకల పర్యటనలు, సభల తర్వాత పార్టీ మరింత పుంజుకుందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టడానికి సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. స్థానిక నాయకులు బిచ్యా నాయక్, సాయిని మల్లేష్‌ల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి, నాయకులు దేవగోని కృష్ణ, ఎరుకల వెంకటేశ్‌గౌడ్, సిద్దాల శ్రీశైలం, నిమ్మల వెంకటేశ్ గౌడ్, కీసర యాదిరెడ్డి, గంగమ్మ, మల్లేష్, దీక్షిత్, రంజిత్, సందీప్, రవీందర్, శంకర్, రాజులతో పాటు పలువురు పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో అధికారంలోకి రానున్న బిజెపి: అందెల

సరూర్‌నగర్, జూలై 9 ప్రభాతవార్త: తెలంగాణ బిజెపి నూతన అధ్యక్షునిగా నియమితులైన కిషన్‌రెడ్డి నేతృత్వంలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో బిజెపి అధికారంలోకి వస్తుందని మహేశ్వరం నియోజకవర్గ పార్టీ ఇంఛార్జి, రాష్ట్రకార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములు యాదవ్ అన్నారు. పార్టీ నూతన అధ్యక్షునిగా కిషన్‌రెడ్డి నియమితులైన సందర్భంగా ఆదివారం ఆయన రాష్ట్ర పార్టీ కార్యాలయానికి తరలివెళ్ళి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కిషన్‌రెడ్డి నాయకత్వంలో పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేస్తామని తెలిపారు. కాగా 15 రోజుల పాటు ప్రజల మధ్యే ఉంటూ గడప గడపకు బిజెపి కార్యక్రమాలను నిర్వహించిన అందెల శ్రీరాములు యాదవ్‌ను కిషన్‌రెడ్డి అభినందించారు.

లక్ష్మీ ఆయుర్వేద ఆయుర్వేద ఉచిత వైద్య శిబిరానికి స్పందన

శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

వనస్థలిపురం, జూలై 9 ప్రభాతవార్త : వనస్థలిపురం పరిధిలోని ఎఫ్‌సిఐ కాలనీలో లక్ష్మీ ఆయుర్వేద ఆసుపత్రిలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ శిబిరానికి వచ్చిన 265 మందికి మోకాళ్ల, కీళ్ల, నడుము నొప్పులు, చర్మవ్యాధులు, పక్షవాతం తదితర వ్యాధులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసారు. ఈ ఆసుపత్రిలో ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులకు, వారి కుటుంబాలకు రీ ఎంబర్స్‌మెంట్ సౌకర్యం ఉందని ఆసుపత్రి ఎండి డాక్టర్ యలగందుల శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ నిఖిత, నవీన్‌కుమార్, సిబ్బందితోపాటు సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

బోనాల పండుగ సందర్భంగా అమ్మవారికి పూజలు : కార్పొరేటర్ లచ్చిరెడ్డి

వనస్థలిపురం, జూలై 9 ప్రభాతవార్త : బి.యన్.రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని మహాలక్ష్మినగర్‌లో నిర్వహించిన బోనాల పండుగ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను తెలిపే బోనాల పండుగను ఘనంగా నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఉపాధ్యక్షులు ముట్టుపల్లి సంతోష్‌రెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ సుమంత్‌రెడ్డి, కాలనీ అధ్యక్షులు యాదయ్య, రాకేష్, రాజు, బాలాజీ, యశోద, కృష్ణ, ఉపేందర్, హరి, చందు నాయక్, చందర్ నాయక్, రాము తదితరులు పాల్గొన్నారు.

పెద్ద చెరువు వరదతో పొంచి ఉన్న ముప్పు



రామంతపూర్‌లో కాంగ్రెస్ భరోసా యాత్రలో పాల్గొన్న పార్టీ సీనియర్ నేతలు

రామంతాపూర్, జూలై 9 ప్రభాతవార్త : రామంతాపూర్ పెద్ద చెరువు నుంచి వచ్చే వరదతో ముంపు పొంచి ఉందని ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఏబ్లాక్ అధ్యక్షుడు మందుముల పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. వరదతో చెరువు కింద ఉన్న కాలనీలకు ప్రమాదం పొంచి ఉన్నప్పటికీ పాలకులు మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ భరోసా యాత్ర కార్యక్రమంలో భాగంగా శనివారం రాత్రి రామంతపూర్ ప్రగతినగర్ తదితర ప్రాంతాల్లో పలువురు పార్టీ నేతలు కలిసి విస్తృతంగా పర్యటించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎస్.ఎన్.డి.పి పనుల్లో తీవ్ర నిర్లక్ష్యం జరుగుతున్నప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. 9 ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో నగర అభివృద్ధి కుంటుపడిందన్నారు. రామంతాపూర్ పెద్ద చెరువునుంచి వరదను తరలించేందుకు చేపట్టిన ఎస్.ఎన్,డి.పీ పనులు సంవత్సరాల తరబడి జరుగుతున్నాయన్నారు. పనుల కారణంగా ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. దీనికి కారణం పాలకుల పర్యవేక్షణ లోపం, నిర్లక్ష్యమేనని గుర్తు చేశారు. రామంతాపూర్ డివిజన్ అధ్యక్షుడు రఫిక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రతినిదులు మేకల శివారెడ్డి, తౌఫిక్, నాయకులు పసుల ప్రభాకర్‌రెడ్డి, కంది ఆగిరెడ్డి, బోరంపేట్ కృష్ణ, రఘుపతిరెడ్డి, తవిడబోయిన గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

39 గుంటల స్థలం దొబీఘాట్‌కు చెందేలా కృషి చేస్తాం : మల్‌రెడ్డి రాంరెడ్డి

రజకులతో మాట్లాడుతున్న మల్‌రెడ్డి రాంరెడ్డి తదితరులు

హయత్‌నగర్, జూలై 9 ప్రభాతవార్త : ఎల్బీనగర్ కాంగ్రెస్ ఇంచార్జ్ మల్‌రెడ్డి రాంరెడ్డి ఆదివారం హయత్‌నగర్ డివిజన్‌లోని పలు కాలనీలలో పర్యటించారు. కాంగ్రెస్ నాయకులు గుర్రం శ్రీనివాస్‌రెడ్డి, సంకేపల్లి సుధీర్‌రెడ్డిలతో కలిసి సమావేశం నిర్వహించారు. ఎట్టి పరిస్థితులోనూ 39 గుంటల స్థలం దొబీఘాట్‌కు చెందేలా కాంగ్రెస్ పార్టీ తరఫున కృషి చేస్తామని తెలిపారు. అదేవిధంగా బంజారాకాలనీలో ఒకటిన్నర ఎకరం ఖాళీస్థలంలోని ఒక ఎకరం జిహెచ్‌ఎంసి స్వాధీనం చేసుకుందని మిగిలిన స్థలాన్ని కొందరు వ్యక్తులు ఆక్రమించడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. ఈ సమస్యపై స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకురాలు సుజాత చాలా కాలంగా పోరాడుతుందని గుర్తు చేశారు. ఈ సమస్యలను ఎంపీ రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఈ ఆక్రమణలను ఆపాలని ఎంపీ వినతిపత్రాన్ని కలెక్టర్‌కి అందించామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలోకి రాగానే ఇక్కడ కమ్యూనిటీ హాల్, కళ్యాణ మండపం నిర్మిస్తామని హామీఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు నర్సింహా యాదవ్, గజ్జి శ్రీనివాస్ మరియు సుజాత రెడ్డి, జైపాల్ రెడ్డి, రజకుల సంఘం అధ్యక్షుడు స్వామి, కిషోర్, సతీష్, మహేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

జల పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

మొక్కను నాటుతున్న సత్యనారాయణ తదితరులు

ఎల్.బి.నగర్, జూలై 9 ప్రభాతవార్త : జలసంరక్షణ, పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని జలమండలి సహాయ సంచాలకులు జాల సత్యనారాయణ పేర్కొన్నారు. జలమండలి, సేవ్ ఎర్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛత జలసంరక్షణ, పర్యావరణ పరిరక్షణ కోసం అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం కొత్తపేట హుడాకాలనిలో నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు మొక్కలు నాటారు. స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించి పార్కును శుభ్రం చేశారు. తదనంతరం ఇంకుడు గుంతల నిర్మాణం నిర్వాహణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంకుడుగుంతలు నిర్మించిన వారు తరుచుగా వాటిలో పేరుకు పోయిన వ్యర్థాలను శుభ్రం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ 320డి జోన్ చైర్మన్ డాక్టర్ బి.విజయరంగా, సేవ్ ఎర్త్ ఫౌండేషన్ ఫౌండర్ చైర్మన్ టి.సురేందర్, హుడా కాలనీ అధ్యక్షుడు అనురూప్‌రాజా, విజయారెడ్డి మల్లెపల్లి, సత్యనారాయణరెడ్డి, రామారావు, సుధాకర్, పునీత్ రాజ్, గుణశేఖర్, నరేష్, ప్రశాంత్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

హబ్సిగూడ పరిధిలో విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఉప్పల్, జూలై 9 ప్రభాతవార్త : హబ్సిగూడ సబ్‌డివిజన్ పరిధిలో సోమవారం వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ఎన్ .రాంరెడ్డి తెలిపారు అప్సిగూడ స్ట్రీట్ నెంబర్ 8, రవీంద్ర నగర్ మహేశ్వరి నగర్, ఎస్ఎస్ నగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి 12:30 గంటల వరకు, అదేవిధంగా సైంటిస్ట్ కాలనీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు సైంటిస్ట్ కాలనీ, జహీర్ నగర్, సాయి ఎంక్లేవ్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఆయన తెలిపారు ప్రజల్లో ఈ అసౌకర్యాన్ని గమనించాలని కోరారు.

ఘనంగా అమ్మవారి ఘటాల ఊరేగింపు

అమ్మవారి ఘటాలను ఊరేగిస్తున్న మల్లేష్‌యాదవ్, రమేష్‌యాదవ్

మలక్‌పేట, జూలై 9 ప్రభాతవార్త : మలక్‌పేట మహబూబ్‌మాన్షన్ మార్కెట్‌లో బోనాల ఉత్సవాల సందర్భంగా పవర్ టిల్లర్స్, ఎడ్ల బండి అసోసియేషన్ అధ్యక్షులు రమేష్‌యాదవ్, మల్లేష్‌యాదవ్‌ల ఆధ్వర్యంలో అమ్మవారి ఘటాల ఊరేగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బోనాల ఉత్సవాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయని తెలిపారు. అంతకుముందు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రమేష్‌యాదవ్, రాంరెడ్డి, రవి, మహేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

డివిజన్‌లో నెలకొన్న సమస్యలపై ఎమ్మెల్యే, కార్పొరేటర్లకు స్థానికుల ఏకరువు

చిలుకానగర్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే బేతి కార్పొరేటర్ గీత తదితరులు

ఉప్పల్, జూలై 9 ప్రభాతవార్త : పాదయాత్ర కార్యక్రమంలో భాగంగా ఆదివారం చిలుకానగర్‌లో ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ పార్టీ నేతలతో కలిసి విస్తృతంగా పర్యటించారు. డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను స్థానికులు ఏకరువు పెట్టారు. డివిజన్ చిలుకానగర్ చౌరస్తానుండి పెద్ద మసీదు లైన్, మార్కండేయనగర్, చిల్కానగర్‌గుట్ట, అభయాంజనేయ స్వామి దేవాలయం, మల్లికార్జున నగర్ శివాలయం, న్యూరామ్‌నగర్, మర్రిచెట్టు, చిలుకానగర్, బొడ్రాయి ప్రాంతంలో పాదయాత్ర నిర్వహించారు. చిలుకానగర్ డివిజన్‌లో త్రాగునీరు సమస్య, లోప్రెజర్ సమస్య, విద్యుత్ స్తంభాల ఆధునీకరణ, వీధి దీపాల ఏర్పాటు, మురికి కాలువ నుండి తీసిన వ్యర్థాలను తొలగింపు, ఓపెన్ నాలాపై పైకప్పు నిర్మాణం, కమ్యూనిటీ హాళ్లు నిర్మించాలని, స్థానికులు వినతి పత్రాలు అందజేశారు. వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేసి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం బొడ్రాయి ఆవరణంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జేరిపోతుల ప్రబుదాస్, మాజీ కార్పొరేటర్లు సింగిరెడ్డి ధనపాల్ రెడ్డి, గుండారపు శ్రీనివాస్ రెడ్డి, బేతి సుమంత్‌రెడ్డి, చిలుకానగర్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు పల్లే నర్సింగరావు, కొక్కొండ జగన్, బిఆర్ఎస్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, వెంకటేశ్వర్‌రెడ్డి, గరిక సుధాకర్, రఘుపతిరెడ్డి, మధుసూదన్ రెడ్డి, నేర్థం భాస్కర్, జల్లి మోహన్, నరేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరు కృషి చేయాలి : చీమల జగన్నాథం

తుర్కయంజాల్, జూలై 9 ప్రభాతవార్త : ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆదేశాల మేరకు తుర్కయంజాల్ మున్సిపాలిటీ 10వ వార్డ్ బిఆర్ఎస్ అధ్యక్షులు నల్లవెల్లి కార్తీక్‌కుమార్ అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చీమల జగన్నాథం ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ కమిటీ సబ్యులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరూ పార్టీ కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి కృషి వల్లే మున్సిపాలిటీలోని ప్రతి కాలనీలో అభివృద్ధి జరిగిందని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేవదాసు, రవి, కాకి లింగం, చెవుల దశరథ, కొమ్మని దయానంద్, చెవుల నరేందర్, తావుల జగన్, ధర్మ కన్నా తదితరులు పాల్గొన్నారు.

రెండు రోజుల్లో చలాన్లు కట్టకుంటే నిర్మాణాల తొలగింపు : తహసిల్దార్

కూల్చివేతలు జరుపుతున్న దృశ్యం

ఎల్.బి.నగర్, జూలై 9 ప్రభాతవార్త : రెండు రోజుల్లో చాలా నలు కట్టకపోతే వెంటనే ఆయా నిర్మాణాలను పూర్తిగా తొలగిస్తామని ఉప్పల్ తహసిల్దార్ గౌతమ్‌కుమార్ హెచ్చరించారు. జీవో 59 దరఖాస్తుదారులకు ఆయన సూచన చేశారు. 2వ రోజు నాగోల్, బండ్లగూడ గ్రామాల్లో పలు అక్రమ నిర్మాణాలను రెవెన్యూ సిబ్బంది కూల్చివేశారు. 847 మంది దరఖాస్తు చేసుకోగా అందులో కేవలం 123 మంది లబ్ధిదారులు నేటి వరకు డబ్బులు చెల్లించారని వారికి వెంటనే రిజిస్ట్రే